# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 5-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 163 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించండి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రానికి టీఆర్ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో ఎంపీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు.

మేడారం జాతరను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహిస్తోంది అని తెలిపారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి మేడారం జాతరకు కోట్లాది భక్తులు తరలివస్తారని ఎంపీ పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాల సీఎంలు కూడా సమ్మక్క, సారలమ్మను గతంలో దర్శించుకున్న విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. గిరిజనుల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారంలో కేంద్ర ప్రభుత్వం ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలి. మేడారం అభివృద్ధికి కేంద్రం రూ. 1000 కోట్లు కేటాయించాలని ఎంపీ బండా ప్రకాశ్ విజ్ఞప్తి చేశారు.

# నేటినుంచి మేడారం మహాజాతర

ములుగు,ఫిబ్రవరి4(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ కుంభమేళగా ప్రసిద్ధి గాంచిన గిరిజన జనజాతర సమ్మక్క-సారలమ్మ మేడారం జాతరకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. బుధవారం 5 నుంచి 8వరకు కొనసాగనుంది. జాతర ప్రారంభానికి రెండు నెలల ముందు నుంచే మేడారాన్ని లక్షలాదిమంది ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అధికారికంగా బుధవారం నుంచి జాతర ప్రారంభం కానుంది. మంగళవారం నాడు పగిడిద్ద రాజు మేడారానికి బయలుదేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు.. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు అవినాభవన సంబంధం ఉన్నది. సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజు స్వస్థలం గుండాల మండలంలోని వేపలగడ్డ గ్రామం. అరెం వంశానికి చెందిన పగిడిద్దరాజు.. వంశీకులు ఇప్పటికీ మేడారం జాతరకు కాలినడకన వెళుతారు. వేపలగడ్డ నుంచి అరెం వంశీయులు పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసుకొని.. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలతో డప్పు వాయిద్యాలు, నృత్యాలతో కాలినడకన మేడారం చేరుకుంటారు. దాంతో అక్కడ జాతర

### గద్దెల వద్దకు బయలుదేరిన పగిడిద్దరాజు
### భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
### ట్రాఫిక్ చిక్కులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు

ప్రారంభమవు తుంది. మంగళవారం నాడు ఈ సంబరం మొదలయ్యింది. ఇకపోతే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం శ్రద్ధ వహించిందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ వెల్లడించారు. జాతరలో చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలకు లోబడి పూర్తి చేశామని, నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. చేపట్టిన పనుల్లో జిల్లా యంత్రాంగం నాణ్యత, పురోగతి ఎప్పటికప్పుడు పర్యవేక్షించిందని, తద్వారా పనుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా చేపట్టినట్లు వెల్లడించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చెక్‌పాయింట్‌లు ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగేలా పోలీస్ యంత్రాంగం ఏర్పాట్లు చేసిందన్నారు. వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలాలను గుర్తించి అభివృద్ధి చేశామని వెల్లడించారు. జాతరకు కోటిన్నరకు పైగా వచ్చే భక్తులకు ఎలాంటి అపరిశుభ్ర వాతావరణం లేకుండా జాతరలో 3450 మంది పారిశుధ్య కార్మికులతో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని వెల్లడించారు. జాతర పరిసరాల్లో 4 అతిపెద్ద డంపింగ్‌యార్డులను, 300 మినీ డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తాగునీరు, రవాణా వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు వివరించారు. భక్తుల రవాణా కోసం టీఎస్ ఆర్టీసీ ద్వారా 4వేల బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేడారంలో 40 ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 41 టికెట్ బుకింగ్ కౌంటర్లు, లైటింగ్, రెయిలింగ్ తదితర ఏర్పాట్లు చేసి రవాణాకు అసౌకర్యం కలుగకుండా చూశామన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. జంపన్నవాగులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది గజఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఇకపోతే మేడారం జాతరకు 10 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ములుగు ఎస్పీ డాక్టర్ సంగ్రాంసింగ్ జీ పాటిల్ తెలిపారు. ఆలయ ప్రాంగణం, ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు ప్రాంతంలో 3 ప్రధాన పోలీస్ క్యాంపులతో పాటు 23 మినీ పోలీస్ క్యాంపులను ఏర్పాటు చేసి 10వేల మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. 300 సీసీ కెమెరాలు, 3 డ్రోన్ కెమెరాలతో జాతర పరిసర ప్రాంతాలు, 29 పార్కింగ్ స్థలాలను నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు.

జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు, ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. గొర్రెలు, మేకలు, ఎత్తుబంగారాలు, పుట్టు వెంట్రుకలు ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర విజయవంతానికి అధికారులు అందరూ కృషి చేయాలని జాతర ఇన్‌చార్జి ఆర్డీవో మహేందర్‌జీ అన్నారు. పరకాల ఆర్డీవో కిషన్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.




చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామివారిని మంగళవారం దర్శించుకున్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి.

# చెర్వుగట్టు జాతరలో అపశృతి

### అగ్నిగుండాలలో పడ్డ యువతి
### రక్షించి ఆస్పత్రికి తరలించిన సిబ్బంది
### స్వామిని దర్శించుకున్న మంత్రి

నల్లగొండ,ఫిబ్రవరి4(నేటినిజం ప్రతినిధి): గత నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న చెరువుగట్టు బ్రహ్మోత్సవాల్లో మంగళవారం అపశృతి చోటు చేసుకుంది. అగ్నిగుండాల కార్యక్రమంలో భక్తులు అందరూ నిప్పులపై నడిచివసుండగా ఓ మహిళపై అదుపుతప్పి నిప్పుల్లో పడిపోయింది. వెంటనే అక్కడి సిబ్బంది ఆమెను బయటకు లాగి ఆస్పత్రికి తరలించారు. మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయని, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. సిబ్బంది అప్రమత్తంతో పెను ప్రమాదం తప్పిందని భక్తులు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం నార్కెట్‌పల్లి-అద్దంకి రహదారిపై కొలువై ఉన్న శ్రీ పార్వతి జడల రామలింగేశ్వరస్వామివారి బ్రహోత్సవాలు ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. బ్రహ్మోత్సోవాలు ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ తెల్లవారుజామున అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత నాలుగు రోజులుగా చెరువుగట్టులో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేలాది సభ్యలో భక్తులు తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం జరిగిన అగ్నిగుండాల ర్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ తదితర జిల్లాలను నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అగ్నిగుండాల కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన శివసత్తులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో శివసత్తులు ఆందోళనకు దిగారు. శివసత్తులకు ప్రత్యేక లైను కేటాయించాలని డిమాండ్ చేసారు.

**స్వామిని దర్శించుకున్న మంత్రి**

చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామివారిని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి నేడు దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి విచ్చేసిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వచనాలను అందించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య ఉన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. స్వామి ఆశీస్సులతో ఉమ్మడి నల్లగొండ జిల్లా కృష్ణా, మూసి, గోదావరి నదుల సవ్వడులతో సస్యశామలంగా మారిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలోని ప్రతి ఇంచు భూమికి సాగునీరు అందించేందుకు పాటుపడుతున్నారన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ ప్రాణమ్మును నిలిపెడి..తి
జ్ఞానము తో సేవలిడు భిషగ్వరుని - మనవర
మానిత గుణుడనుచు సతతము
ధ్యానములో నిలిపెదను ప్రతాప్.సి.రెడ్డినే!!

(ఫిబ్రవరి 5 ప్రతాప్ సీ.రెడ్డి జననం)



–రాధశ్రీ
సెల్: 9494481210

# వారాంతం వల్లే మార్కెట్లకు నష్టం

### –ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 (ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్ దేశీయ మార్కెట్లను తీవ్రంగా నిరాశపర్చింది. బ్జడెట్‌లో ఆశించిన ప్రతిపాదనలేవీ లేకపోవడంతో మదుపర్లు అసంతృప్తికి గురయ్యారు. ఫలితంగా సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. అయితే మార్కెట్ల పతనానికి బడ్జెట్ కారణం కాదని వారాంతం కావడంవల్లే అలా జరిగిందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆశక్తికర సమాధానం ఇచ్చారు. ఫిక్కీ ఆధ్వర్యంలో ఢిల్లీలో

జరిగిన ఓ కార్యక్రమానికి నిర్మలా సీతారామన్ హాజరయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్జడెట్ రోజున సెన్సెక్స్ ఎందుకు సంతోషంగా లేదు? అని ఓ వ్యక్తి కేంద్రమంత్రిని అడిగారు. ఇందుకు ఆమె స్పందిస్తూ.. 'ఈ రోజు మార్కెట్లు సంతోషంగానే ఉన్నాయి కదా.. శనివారం మదుపర్లు వీకెండ్ మూడ్‌లో ఉన్నారు. ఈ రోజు నిజమైన పని మూడ్‌లోకి వచ్చేశారు. అందుకే ఈ రోజు మార్కెట్లు లాభాల్లోకి వచ్చాయి. ఎక్కువ లాభాలు కాకపోవచ్చు. కొంతమేరైతే సంతోషంగానే ఉన్నాయి కదా ' అని సమాధానమిచ్చారు.

బడ్జెట్ రోజున మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనైన విషయం తెలిసిందే. గత శనివారం ఒక్క రోజే సెన్సెక్స్ ఏకంగా 988 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ కూడా 300 పాయింట్లు పతనమైంది. అయితే ఈ భారీ నష్టాల నుంచి మార్కెట్లు సోమవారం కాస్త కోలుకున్నాయి. సెన్సెక్స్ 137 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 46 పాయింట్లు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలతో మంగళవారం కూడా సూచీలు లాభాల్లో కొనసాగాయి.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హైదరాబాద్,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. హైదరాబాద్‌లోని అమీర్‌పేట క్రాస్ రోడ్స్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్నఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఫీవర్ ఆస్పత్రిలో మరో రెండు కరోనా కేసులు

హైదరాబాద్,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో మరో రెండు కరోనా అనుమానిత కేసులు నమోదయ్యాయి. నాదర్‌గుల్‌కు చెందిన మహిళ(42), కూకట్‌పల్లికి చెందిన వ్యక్తి(32) ఇటీవల చైనా నుంచి వచ్చారు. వారిలో వైరస్ ప్రభావం తీవ్రంగా ఉండడంతో వైద్య పరీక్షల కోసం ఫీవర్ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులు వారిని ప్రత్యే ఐసోలేషన్ వార్డులో ఉంచి పరీక్షలు నిర్వహించారు. సేకరించిన రక్త నమూనాలను గాంధీ ఆస్పత్రిలో మంగళవారం పరీక్షించనున్నారు. ఇద్దరికీ వైరస్ ప్రభావం లేదని వైద్యులు అంటున్నారు. పరీక్షల అనంతరం వారు ఇంటికి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఫీవర్ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో ముగ్గురు అనుమానితులు ఉన్నారు.

# క్యాన్సర్ పెయిన్‌ఫుల్ వ్యాధి

### స్ర్కీనింగ్ సెంటర్ ప్రారంభించిన గవర్నర్

హైదరాబాద్,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): కేర్ ఆస్పత్రిలో క్యాన్సర్ ఉచిత స్ర్కీనింగ్‌ను గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ.. క్యాన్సర్ అనేది పెయిన్‌ఫుల్ వ్యాధి అని పేర్కొన్నారు. క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన ఉండాలన్నారు. క్యాన్సర్ రోగులకు కుటుంబ సభ్యుల సహకారం చాలా అవసరమని గవర్నర్ చెప్పారు. మహిళలకు ఆరోగ్యం కంటే చీరలు, నగలపైనే మక్కువ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టండి. క్యాన్సర్ చివరి దశలోనే బయటపడుతుంది అని ఆమె పేర్కొన్నారు. 500 మందికి స్ర్కీనింగ్ చేయించిన ఎమ్మెల్యే గొంగిడి సునీతకు అభినందనలు తెలిపారు. తన భర్త నెఫ్రాలజిస్ట్.. ఉచితంగా డయాగ్నోసిస్ చేస్తున్నారని గవర్నర్ తమిళిసై చెప్పారు.

# మరోమారు పిల్లల విక్రయ ముఠా కలకలం

### సైబరాబాద్ పోలీసుల దాడిలో ముఠా గుట్టురట్టు
### సంతానసాఫల్య కేంద్రాల మధ్యవర్తిత్వంపై పోలీసుల ఆరా

హైదరాబాద్,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): శిశు విక్రయాల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పోలీసుల విచారణలో ఏపీకి చెందిన 9మంది ఏజెంట్ల చిట్టా బయటపడింది. మగశిశువు ఖరీదు రూ.14లక్షలుగా ఈ ముఠా నిర్ణయించింది. తల్లికి రూ. 70 వేలు ఇచ్చి శిశువును విక్రయించి.. ఏజెంట్లకు రూ.లక్షల్లో మార్జిన్లను ఈ ముఠా ఇస్తోంది. దీనికంతటికీ సంతాన సాఫల్య కేంద్రాల నిర్వాహకులు మధ్యవర్తిత్వం వహిస్తున్నారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇప్పటివరకు 14మంది శిశువులను అమ్మినట్లు సమాచారం. మొత్తానికి కూపీ లాగిన సైబరాబాద్ పోలీసులు పిల్లల్ని విక్రయించే ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురు సభ్యుల ముఠాను ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పిల్లలను ఏపీకి చెందిన ముఠా విక్రయిస్తున్నట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముఠా సభ్యులు సంతానం లేని వారిని గుర్తించి వారికి పిల్లల్ని విక్రయిస్తున్నట్లుగా సమాచారం. తండాల్లోని అధిక సంతానం ఉన్న పేద తల్లిదండ్రులే లక్ష్యంగా ముఠా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పసికందులను కొనుగోలు చేసి రూ.లక్షల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యాపారంపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేయడంతో వ్యవహారం బయటపడింది.

# ఢిల్లీకి చేరిన అమరావతి రైతులు

### ఉపరాష్ట్రపతి వెంకయ్యతో భేటీ
### రాజధానిగా అమరావతినే కొనసాగించాలని వినతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): రాజధాని అమరావతి పంచాయితీ ఢిల్లీకి చేరింది. రైతులు, జేఏసీ నేతలు మంగళవారం ఉదయం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుని కలిశారు. రాజధాని కోసం రైతుల ఆందోళనలు, రైతుల పట్ల పోలీసుల తీరును వెంకయ్యనాయుడి దృష్టికి తీసుకెళ్లారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. రాజధాని కోసం వేలాది ఎకరాల భూములు ఇచ్చాం. ఇప్పుడు రాజధాని మార్పు అంటున్నారు. తాము ఆందోళన వ్యక్తం చేస్తే తప్పుడు కేసులు పెడుతున్నారు. దాడులు చేస్తున్నారని అంటూ రైతులు తమ గోడుని ఉపరాష్ట్రపతికి వినిపించారు. రాజధాని తరలిపోకుండా చూడాలని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకునేలా సూచించాలని కోరారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లాడుతూ.. ఉప రాష్ట్రపతిని కలిసి రాజధాని అంశం, ప్రభుత్వ పనితీరును వివరించామని రాజధాని రైతులు వెల్లడించారు.

రైతుల ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని చెప్పామన్నారు. రాష్ట్రానికి రాజధాని ఒక్కటే ఉండాలని.. అది అమరావతే కావాలని రైతులు స్పష్టం చేశారు. అపాయింట్‌మెంట్ రాగానే రాష్ట్రపతిని కలుస్తామన్నారు. కేంద్ర మంత్రులను, ప్రతిపక్ష నేతలను కలిసి పరిస్థితిని వివరిస్తామని రాజధాని రైతులు తెలిపారు. రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్‌లు కూడా కోరామని, వారిని కూడా కలిసి సమస్య వివరిస్తామని తెలిపారు. అపాయింట్‌మెంట్ దొరికితే రైతులు ప్రధాని మోడీని కూడా కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. రాజధానిని మార్చవద్దంటూ రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇదిలావుంటే రాజధాని రైతుల ఆందోళనలు 49వ రోజుకి చేరుకున్నాయి. మందడం, తుళ్లూరులో ధర్నాలు కొనసాగుతున్నాయి. వెలగపూడిలో 49వ రోజు రిలే దీక్షలు జరుగుతున్నాయి. మిగతా రాజధాని గ్రామాల్లోనూ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. నేడు కూడా రైతుల 24 గంటల దీక్షలు కొనసాగనున్నాయి. తుళ్ళూరులో 48 గంటల దీక్షలు కొనసాగనున్నాయి. నేడు మందడం, వెలగపూడిలోను 24 గంటల దీక్షకు రైతులు కూర్చోనున్నారు.

# మరో 64మంది మృత్యువాత

### 425కి చేరిన కరోనా మృతులు

బీజింగ్,ఫిబ్రవరి4 (ఆర్ఎన్ఎ): చైనాలో కరోనా మహమ్మారి తీవ్రరూపం దాలుస్తోంది. రోజురోజుకీ మరణిస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. తొలుత రోజుకి 10 నుంచి 20కి పరిమితమైన మరణాలు ఇప్పుడు ఏకంగా 50 దాటిపోతోంది. ఆదివారం 57 మంది ప్రాణాలొదలగా.. సోమవారం ఏకంగా 64 మంది మృత్యువాతపడ్డారు. దీంతో చైనాలో ఇప్పటి వరకు ఈ వైరస్ బారినపడి మృతిచెందినవారి సంఖ్య 425కి చేరింది. ఇక ఈ వైరస్ సోకిన వారి సంఖ్య 20,438కి చేరింది. ఫిలిప్పీన్స్‌లో చనిపోయిన వ్యక్తితో కలిసి ప్రపంచవ్యాప్తంగా కరోనా 426 మందిని బలిగొంది.

ఇప్పటికే పటిష్ఠ చర్యలు చేపట్టిన చైనా ప్రభుత్వం.. వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉన్న మరికొన్ని ప్రాంతాల్లోనూ ఆంక్షలు విధించింది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అధ్యక్షుడు షి జిన్‌పింగ్ మరోసారి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వైరస్ కట్టడికి సమయంతో కలిసి పరుగెత్తాల్సి పరిస్థితి ఏర్పడిదంటూ అధికారులకు మార్గనిర్దేశర చేశారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. మరోవైపు జపాన్‌కు చెందిన క్రూయిజ్ షిప్‌లో ఉన్న 3000 మందిలో ఒకరికి వైరస్ సంక్రమించినట్లు నిర్ధారించారు. దీంతో నౌకలో ఉన్నవారందరినీ వేరుగా ఉంచాలా.. లేదా.. అన్నదానిపై నిర్ణయం తీసుకునేందుకు జపాన్ ప్రభుత్వం తర్జనభర్జనలు పడుతోంది. వైరస్ రోజురోజుకీ పంజా విసురుతున్న నేపథ్యంలో ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యాయి. చైనా ప్రయాణాలపై నిషేధం విధించాయి. ఇప్పటికే చైనాలో ఉన్న విదేశీయులు తమ స్వదేశాలకు తరలిపోయారు. చైనా నుంచి వచ్చే వారిని ఫిలీప్పన్స్ పూర్తిగా నిషేధించింది. ఇటు భారత్‌లోనూ ఇప్పటికి మూడు కరోనా కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్రం, రాష్ట్రాలు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రత్యేక వార్డులు ఏర్పాట్లు చేసి అనుమానితుల్ని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.




# దేశప్రాధాన్యం పెరగడం ఖాయం!

నేటి నిజం

బుధవారం 5-2-2020

సూర్యుడు మానవాళిని పెంపొందిస్తున్న సహజ జీవశక్తి... మానవులకు మాత్రమే సకల జీవజాలానికి ప్రాణశక్తి సూర్యుడు! వెలుగును వేడిమిని ప్రసాదిస్తున్న సూర్యుడు వర్షం కురిపిస్తున్నాడు, వర్షం ద్వారా 'అన్నం' తయారవుతోంది. 'అన్నం' జీవజాలానికి జవస త్వాలను ప్రసాదిస్తున్న అమృతం! అందువల్ల "సూర్యః ఆత్మా జగతః తస్థుషః"– సూర్యుడు చరాచర జగత్తునకు ఆత్మ–అన్న సృష్టిగత వాస్తవాన్ని భారత జాతి అనాదిగా సమాజ జీవన స్థితం చేసుకొంది! "మిత్రః పృథివీం ఉ తద్యాం దాధార"– సూర్యుడు భూమిని అంతరిక్షాన్ని ధరించిన– వాస్తవాన్ని కూడ వేద ఋషులు, భారతీయులు అనాదిగా ఆవిష్కరించారు! ఈ సనాతన వాస్తవానికి ఆధునిక ఆవిష్కరణ సౌరశక్తి ద్వారా విద్యుచ్ఛక్తిని తయారుచేయడం. మన దేశం వంటి 'సమశీతోష్ణ మండల' భూమిపై నెలకొన్న దేశాల సూర్యుడు ఏడాది పొడవునా పుష్కలంగా కాంతిని ప్రసరింప చేస్తున్నాడు. అందువల్ల సూర్యుడికి కృతజ్ఞతలను తెలుపడం భారతీయ సమాజ నిహితమైంది. 'సంధ్యావందనం' సూర్యుని గతిపై ఆధారపడి ఉన్న మానవ జీవన ప్రక్రియ! సూర్యుడు బుద్ధిని ప్రచోదనం చేస్తున్నాడన్న వాస్తవం గాయత్రీ మంత్రం!! ఈ ఖగోళ, ప్రాకృతిక వాస్తవం ప్రపంచంలోని సకల జీవజాలం మనుగడకు ప్రాతిపదిక! గుర్తించని వారు సూర్యుడిని కేవలం అగ్నిగోళంగా భావిస్తున్నారు. గుర్తించిన భారతీయులు అనాదిగా సూర్యుడిని ప్రాణప్రదాతగా ఆరాధిస్తున్నారు! 'రథ సప్తమి' ఈ ఆరాధనకు కృతజ్ఞత ఆవిష్కరణకు ప్రత్యేక ప్రతీక!!వివిధ ఇంధనాల వినియోగంవల్ల ప్రకృతి కాలుష్యగ్రస్తం అవుతోంది. అంతేకాదు ఈ ఇంధన నిక్షేపాలు పరిమితంగా ఉన్నాయి. నిరంతరం వినియోగంవల్ల ఈ ఇంధనాల నిక్షేపాలు ఏదో ఒక రోజున అంతరించి పోవడం ఖాయం... వంద ఏళ్లు పట్టవచ్చు రెండు వందల ఏళ్లు పట్టవచ్చు! బొగ్గు, చమురు, ఇంధన వాయు నిక్షేపాలు అంతరించేలోగా మరోచోట సహజం గా ఈ ఇంధనాల నిక్షేపాలు ఏర్పడుతా యన్న విశ్వాసం కూడ లేదు. అందువల్ల విద్యుచ్ఛక్తి ఏకైక ఇంధనంగా ఎప్పుడో అప్పుడు ఏర్పడక తప్పదు. బొగ్గు ద్వారాను, అణు ఇంధనం ద్వారాను విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేసే ప్రక్రియవల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది! బొగ్గువాడకం పూర్తిగా తగ్గించాలన్నది పర్యావరణ కాలుష్య నివారణకు 'పారిస్' సదస్సులో చేసిన నిర్ధారణ... అందువల్ల జల విద్యుచ్ఛక్తి, సౌర విద్యుచ్ఛక్తి వాడకం, ఉత్పత్తిపెరగడం అనివార్యమైన పరిణామక్రమం! "పంచభూత భాసితమైన" ప్రకృతిలో నిజానికి ఈ మూడువిధాల విద్యుత్ ఇంధనాలు నిహితమై ఉన్నాయి. అందువల్ల సౌరశక్తి ప్రాధాన్యం పెరిగినకొద్దీ అంతర్జాతీయ సమాజం మన దేశం ప్రాధాన్యం పెరగడం ఖాయం! సమశీతోష్ణ భూమండలాన్ని 'సౌరశక్తి మండలం'గా గుర్తించడం మన ప్రభుత్వం సాధించిన విజయం. సూర్యుని సాపేక్ష 'చలనం' ప్రాతిపదికగా ఏర్పడిన సనాతన– శాశ్వత– భౌగోళిక స్థితి ఈ సౌరశక్తి మండలంలో మన దేశానికి సహజమైన నాయకత్వం కట్టబెట్టింది. భూమధ్య రేఖకు దక్షిణంగా ఉన్న ఇరవై మూడున్నర డిగ్రీ–ల అక్షాంశంపై మకరరేఖ–కాప్రికార్న్– ఏర్పడి ఉంది! భూమధ్య రేఖకు ఉత్తరంగా ఇరవై మూడున్నర అక్షాంశంపై కర్కటకరేఖ కాన్సర్ ఏర్పడి ఉంది! భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్న క్రమంలో ఈ రెండు 'రేఖ'ల మధ్య ఉన్న–మకర రేఖకూ, కర్కాటక రేఖ కు మధ్య ఉన్న– భూమండల ప్రాంతంలోనే సూర్యుడు 'సాపేక్షం'గా సంచరిస్తున్నాడు. ఈ ప్రాంతంలో మాత్రమే సూర్యుడు నిటారుగా పెరుగు తున్నాడు. అందువల్ల ఈ సమశీతోష్ణ మండలం దేశాలలో సౌరశక్తి వనరులు అపారం, అత్యధికం, అనంతం! చైనా, జపాన్, అమెరికా, బ్రిటన్, రష్యా వంటి సంపన్న దేశాలు ఈ సమశీతోష్ణ భూమండలానికి వెలుపల నెలకొని ఉన్నాయి. ఈ సమశీతోష్ణ మండలంలోని అతి ప్రముఖ దేశం భారతదేశం. అందువల్ల మన ప్రభుత్వం చొరవతో ఏర్పడిన ఈ 'సౌరశక్తి మండల దేశాల కూటమి' నాయకత్వం సహజంగా మన దేశానికి లభించింది. 'కూటమి'కార్యాలయం మన దేశంలో నెలకొని ఉంది. భారతదేశానికి లభించిన ఈ ప్రాధాన్యం సూర్యుడు ప్రసాదిస్తున్న వరం! వికసించిన వెలుగుల 'పువ్వుల' సుగంధం సౌరశక్తి!! 'రథ సప్తమి'నాడు ఈ 'సుగంధపు' కాంతి కిరణ పుష్పాలతోనే వెలుగుల ప్రదాతను పూజించడం సహజ సనాతన ప్రాకృతిక సంప్రదాయం.

## ప్రధాన రహదారుల నిర్మాణంపై నిర్లక్ష్యం

### ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని వైనం

### విస్తరణ కోసం ఎదురు చూస్తున్న జనం

నిజామాబాద్,ఫిబ్రవరి 4(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ప్రధాన రహదారులైన హెచ్ఎంబీ, కేకేవై రహదారులపై రద్దీ కారణంగా విస్తరణ చేపట్టాలన్న ఆలోచనలు ముదుకు సాగడం లేదు. ఈ రహదారులపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఈ రెండు రహదారులు నిత్యం వాహనాల రాకపోకలతో ఇరుకుగా మారాయి. దీంతో వీటి విస్తరణతో పాటు రాష్ట్ర రహదారులుగా ఉన్న రెండు రహదారులను కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులుగా గుర్తించింది. వీటి నిర్మాణాల కోసం సర్వేను కూడా చేపట్టింది. ఈ సర్వేలు పూర్తి చేసి నెలలు గడిచిపోతున్నా.. నిధులు మాత్రం కేటాయించడం లేదు. దీంతో ఈ రెండు జాతీయ రహదారుల నిర్మాణ పనులు చేపడాతారా లేదా అన్న ఆందోళన కలుగుతోంది. ఎప్పుడెప్పుడు పూర్తి చేస్తారో అని ఎదురు చూస్తున్న జిల్లా వాసులకు నిరాశే ఎదురవుతోంది. ఇప్పటికే హెచ్ఎంబీ జాతీయ రహదారి పను లు హైదరాబాద్ నుంచి మొదలుకొని మెదక్ జిల్లా కేంద్రం వరకు కొనసాగుతున్నాయి.

మెదక్ జిల్లా కేంద్రం నుంచి ఎల్లారెడ్డి– బా న్సువాడ– బోధన్–బైంసా వరకు జాతీయ ర హదారి పనులు సర్వేకే పరిమిత మయ్యాయి. ఈ పనుల నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతోనే జాతీయ రహదారుల పనులు నిలిచిపోయాయని ఆర్ అండ్బీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. రోడ్డు పనులను చేపట్టేలా కేంద్ర సర్కార్ నిధులు కేటాయించాలని ప్రజాప్రతినిధులు పదేపదే కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేకుండాపోయింది. ఇక్కడి నుంచి బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ ప్రాతినిధ్యం వహిస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో జిల్లాలోని ఈ రెండు ప్రధాన రహదారులకు తీరని అన్యాయమే జరిగింది. రవాణా వ్య వస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లా మీదుగా వెళ్లే హైదరాబాద్– మెదక్– బోధన్– బైం సా(హెచ్ఎంబీ) రాష్ట్ర రహదారిని, కరీంనగర్– కామారెడ్డి– ఎల్లారెడ్డి– పిట్లం చౌరస్తా(కేకేవై) రాష్ట్ర రహదారులను జాతీయ రహదారిగా గుర్తించింది. కానీ ఈ రహదారుల నిర్మాణాల కోసం బ్జడెట్లో నిధులు కేటాయించడంలో మాత్రం శ్రద్ధ చూపలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ రెండు రహదారులకు నిధులు కేటాయిస్తే రహదారుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయి వాహనరాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయి. హైదరాబాద్ నుంచి బైంసా వరకు 5 జిల్లాలను కలుపుకుని వెళ్లే హెచ్ఎంబీ రహదారితో పాటు, కరీంనగర్ నుంచి పిట్లం చౌరస్తా వరకు రెండు జిల్లాలను కలు పుకొని వెళ్లే ఈ రెండు రహదారులు పూర్తయితే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండడంతో పాటు సమయం ఆదా అవుతుంది. జిల్లాకు చెందిన రాష్ట్ర శాసనసభపతి ఆధ్వర్యంలో ఎంపీ, బీబీ పాటిల్తో పాటు ఎమ్మెల్యేలు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి రహదారికి నిధులు కేటాయించాలని, పనులు త్వరగా ప్రారంభించేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిధులను కేటాయించడంలో బీజేపీ సర్కార్ పూర్తిగా విఫలమైందని ప్రతిపక్షాలు మండి పడుతున్నాయి.

ఈ రహదారుల వెంబడి కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, తదితర రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం ఇరుకుగా ఉన్న ఈ రహదారులపై పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

## కొత్త పంచాయితీల్లో రేషన్ నిల్

### –పాత షాపులకే వెళ్లాల్సి వస్తోంది

కామారెడ్డి,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): కొత్తగా పంచాయితీలు ఏర్పాటు చేసిన గ్రామాల్లో రేషన్ షాపులు లేక ప్రజలు అవస్థ పడుతున్నారు. పాతపంచాయితీలకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. దీనిని తప్పించి కొత్త పంచాయితీలకు రేషన్ షాపులను విస్తరించాలని కోరుతున్నారు. కొత్తగా ఏర్పాటైన పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటులో సాంకేతిక సమస్య ఏర్పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 నుంచి 450 రేషన్ కార్డులు ఉంటేనే రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలి. కొత్త గ్రామ పంచాయతీల్లో 200 నుంచి 500 లోపే గృహాలు ఉండడం, అందులోనూ 150 నుంచి 200 వరకే కార్డులు ఉండటంతో రేషన్ దుకాణాలు ఏర్పాటు సాధ్యం కావడం లేదని తెలిసింది. కొత్త దుకాణం ఏర్పాటైతే పాత షాపుల్లో కార్డులు తగ్గి, డీలర్కు ఆదాయం పడిపోతుందని అధికారులు చెబుతున్నారు. కొత్త దుకాణాల ఏర్పాటు ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపినా.. వీటిపై ఎటూ తేల్చలేని పరిస్థితి ఉంది. పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. తండాలు సైతం పంచాయతీలుగా ఆవిర్భవించాయి. కామారెడ్డి జిల్లాలోని 323 గ్రామ పంచాయతీలకు కొత్తగా 203 చేరడంతో 526కి చేరాయి. కొత్త గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు మంజూరు కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు రేషన్ సరుకుల కోసం పాత గ్రామ కేంద్రాలకు వెళ్లక తప్పడం లేదు. ప్రతీనెల రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని దుకాణాల నుంచి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారు. కామారెడ్డి జిల్లాలో 22 మండలాలతోపాటు కా మారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 577 రేషన్ దు కాణాలున్నాయి. గతంలో 323 గ్రామ పంచాయతీ లుండగా ఇటీవల 203 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. నూతన పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో పాత పంచాయతీ ల్లోని రేషన్ దుకాణాల వద్ద నుంచే రేషన్ సరుకులను తెచ్చుకుంటున్నారు. 323 గ్రామ పంచాయతీలు ఉన్నప్పుడు 577 రేషన్ దుకాణాలు ఉండేవి. కొత్త గ్రామ పంచాయతీల్లో ఒక్క రేషన్ దుకాణం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పడినా తాము రేషన్ సరుకుల కోసం పాత గ్రామ పంచాయతీకి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు.

# అభివృద్ధి వికేంద్రీకరణను విస్మరించిన బడ్జెట్

హైదరాబాద్, ఫిబ్రవరి 4:కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని తెలంగాణ ఐటిశాఖ మంత్రి, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఘాటుగానే అన్నారు. రాష్ట్రానికి కేంద్రం అదనంగా ఒక్క పైసా కూడా అదనంగా ఇవ్వలేదని తెలిపారు. బీజేపీ నేతలకు దమ్ముంటే ఢిల్లీ నుంచి నిధులు తీసుకురావాలని సవాలు విసిరారు. తమకూ అన్యాయం జరిగిందని, ఎపికి కేటాయింపులు జరపలేదని వైకాపా నేతలు మండిపడ్డారు. మధ్య తరగతి ప్రజలు కూడా తమకు ఎలాంటి లాభం లేదని వాపోయారు. ఇన్కమ్ టాక్స్ తగ్గింపుల కోసం ఎదురుచూసిన ఉద్యోగవర్గాలు పెదవి విరిచాయి. ఇకపోతే ప్రధానంగా రాష్ట్రాలకురావాల్సిన పన్నుల వాటాలు రావడం లేదు. అలాగే రాష్ట్రాలను అభివృద్ధి చేయడమంటే దేశాన్ని అభివృద్ధి చేసుకోవడం అన్న విషయాన్ని గత పాలకులు గుర్తించ లేదు. కనీసం బిజెపి ప్రభుత్వం కూడా గుర్తించడం లేదు. పట్టణాలు, నగరాలను అభివృద్ధి చేయడం, మౌళిక సదుపాయాలకు నిధులు వెచ్చించడం వంటి ప్రణాళికలు తీసుకో లేదు. రోడ్డు,రైలు మార్గాలను అభివృద్ది చేయాలన్న సంకల్పం బడ్జెట్లో కానరాలేదు. ప్రధాన రంగాలను అభివృద్ది చట్రంలోకి తీసుకుని వచ్చి ముందుకు సాగితే తప్ప దేశం పురోగమించదని గుర్ఇంచనంత కాలం ఏ రంగానికి ఎంత కేటాయించినా లాభం ఉండదు. ఇకపోతే బడ్జెట్లో ఆదాయపు పన్ను విషయంలో ఎలాంటి భరోసా లేక పోవడంతో నగటు పన్నుదారుడిని గందరగోళంలో ముంచేసింది. పన్ను శ్లాబులను బాగా తగ్గించి, చేతిలో మిగులు సొమ్ము ఎక్కువ ఉంచగలిగితే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుంది. కానీ, ఆర్థికమంత్రి ప్రజలను పొదుపు మాని, ఉన్నదంతా ఖర్చు చేయమంటున్న తీరుగా ప్రతిపాదనలు ముందుంచారు. భవిష్యత్ భద్రతను గాలికొదిలేసి ఖర్చుదారులుగా మారి పోమంటు న్నారు. బడ్జెట్ బాగుందని చంకలు గుద్దుగుంచుకుంటున్న ప్రభుత్వ వర్గాలు మాత్రం అందుకు తగ్గట్లుగా సమాధానం చెప్పలేకపోతున్నాయి. అలాగే ఆర్థికరంగం కుదేలవుతున్న వేళ తీసుకుంటున్న చర్యలకు సంబంధించి బడ్జెట్లో ఎలాంటి హామీదక్కలేదు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఒప్పుకున్నా.. ఒప్పుకోక పోయినా దేశం ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉందన్నది సుస్పష్టం. ఆర్థికస్థితి ఏమాత్రం బాగున్నా బడ్జెట్ ప్రతిపాదనలు ఎలా ఉన్నా భరోసా ఉండేది. దేశీయంగా డిమాండ్ తగ్గడంతో జీడీపీ పదేళ్ళ కనిష్ఠానికి పడిపోయింది. ఉత్పాదకత కుంటుపడటంతో పన్నువసూళ్ళు సన్నగిల్లి, ద్రవ్యలోటు పెరిగి, ప్రభుత్వ వ్యయం తగ్గింది. నిరుద్యోగం పెరుగుతూ పోవడం వల్ల యువతలో నైరాశ్యం నెల కొంది. దీనికి సంబంధించి గత ఐదేళ్లలో ఎంతమందికి ఉద్యోగావకాశాలు వచ్చాయో లెక్కలేదు. నిస్తేజంగా ఉన్న ఆర్థిక వ్యవస్థకు బడ్జెట్ భరోసా కలిగించ కపోగా, సగటుమనిషికి సంతృప్తిని మిగల్చలేకపోయింది. బడ్జెట్ దెబ్బకు స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు పదకొండేళ్ళలో లేనంతటి భారీ పతనాన్ని నమోదుచేశాయి. స్టాక్మార్కెట్కు సంతృప్తి కలిగించలేకపోవడమే కాదు, మొత్తంగా వృద్ధికి ఊతమిచ్చే కనీస చర్యలేవీ బడ్జెట్లో లేక పోయాయి.ఆంధ్రప్రదేశ్కు రూ.1521 కోట్లు, తెలంగాణకు దాదాపు 2400కోట్లు ఈ ఒక్క ఏడాదికే తగ్గిపోతున్నప్పుడు మొత్తం ఐదేళ్ళూ భారీగా నష్టపోతున్నట్టేనని భావించాలి. మాంద్యం దెబ్బతో నీరసించిఎత్తున్న రాష్ట్రాలను కేంద్రం ఆదుకునే ప్రయత్నాలు చేయలేదు. రాయితీలు, ఉద్దీపనలు ఊపిరిపోయడం లేదు. ఆర్బీఐతో పోరాడి గత ఏడాది తెచ్చిన రెండు లక్షల కోట్లు, ఇప్పటి మరో లక్ష కోట్లూ ఏ మూలకూ చాలడం లేదు. ఆర్థిక రంగం ఒడిదుడుకులు ఎదుర్కొంటూ, మందగవ నంతో అది అందరినీ భయపెడుతున్న వేళ... అందరినీ మెప్పించ లేకపోయినా ఇప్పుడున్న సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు మార్గాలు అన్వేషించలేదు. ఉపాధి అవకాశాలు పెరిగితేనే ఆదాయం వస్తుంది. ఆ వచ్చిన ఆదాయం పన్నుల రూపంలో పెద్దగా పోనప్పుడు వారు తమ అవసరాల కోసం ఖర్చు పెట్ట గలుగుతారు. అయితే ఈ క్రమంలో ఖజానా పెద్దగా నష్టపోకూడదని ప్రభుత్వం భావిస్తుంది. పన్ను వసూళ్ల తగ్గకుండావున్నప్పుడే అది సాధ్యమవుతుంది. కనుక ప్రజల కొనుగోలు శక్తి పెంచి వినిమయం బాగుండేలా తీసుకునే చర్యలకూ, ఖజానా దండిగా నిండటానికి చేసే ప్రయత్నాలకూ మధ్య వైరుధ్యం ఉంటుంది. దీన్నెంత ఒడుపుగా చేయ గలుగుతారన్న దాన్నిబట్టే ఆర్థికమంత్రి చాకచక్యం వెల్లడవుతుంది. మిగిలినవాటి మాటెలావున్నా ప్రతి బ్జడెట్కు ముందూ మధ్యతరగతి ఆశగా ఎదురు చూసేది ఆదాయం పన్ను మినహాయింపు. కేంద్ర ఆర్థిక మంత్రి కనికరించి గడిచిన సంవత్సరంకన్నా పన్ను భారం మరింత తగ్గిస్తే బాగుండునని మధ్యతరగతి జీవులు ఆశిస్తారు. ఆ విషయంలో ప్రతిసారీ వారికి నిరాశే ఎదురవుతోంది. ఈసారి నిర్మలా సీతారామన్ ఆదాయం పన్ను వసూలుకు సంబంధించి రెండు రకాల విధానాలు ప్రతిపాదించారు. ఇప్పుడున్న మూడు శ్లాబ్లను యధాతథంగా కొనసాగిస్తూ, దాంతోపాటు ఏడు కొత్త శ్లాబ్లు ప్రకటించారు. కొత్త శ్లాబుల్ని ఎంచుకుంటే కొన్ని మినహాయింపులు ఎగిరిపోతాయని ఆమె చావు కబురు చల్లగా చెప్పడంతో అందరూ నీరసపడ్డారు. రెండు కత్తులను ఇచ్చి దేంతో పొడుచుకుంటావో నీవే పొడుచుకో అన్న చందంగా విధానం ఉంది. మొత్తంగా ప్రధాన రంగాలను ఎంచుకుని రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఖర్చులు పెడితే విభేదాలు రావు. రాజకీయాలకు అతీతంగా కేటాయింపులు ఉండాలే తప్ప మరోలా ఆలోచన చేయరాదు.

# ఎల్ఐసిని నిర్వీర్యం చేయడం ఎంతవరకు సబబు?

### దీనివెనక అదృశ్య శక్తులు ఉన్నాయా

### ప్రభుత్వ బీమారంగాన్ని దెబ్బతీసే కుట్రలు చేస్తున్నారా

### బీమారంగంలో ప్రోత్సాహకాలను తగ్గించడంపై ఆందోళన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లోని వాటాలను విక్రయించదల్చుకున్నట్టు నిర్మలాసీతారామన్ బడ్జెట్లో చేసిన ప్రకటన ఒకింత నిరాశకు గురి చేసేదే. ఇది పాలసీదారుల్లో ఉనన భరోసాను దెబ్బతీస్తుందిన నిపుణులు హెచ్చరిస్తున్నారు. బీమారంగంలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించినా, ప్రజలు ఎల్ఐసీ వైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికీ ఆ సంస్థే అగ్రగామిగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం పునరాలోచించడం ఉత్తమం అని సూచిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రానికి ఎల్ఐసీలో పది శాతం వాటావుంది. ఇందులో ఏమేరకు విక్రయిస్తారో చూడాలి. దండిగా లాభాలు ఆర్జిస్తున్న ఎల్ఐసీలో ప్రైవేటీకరణకు వీలుకల్పించే ఈ చర్య అమలు అంత సులభం కాదు. దీన్ని ప్రతిఘటిస్తామని బీమా ఉద్యోగులు ఇప్పటికే హెచ్చరించారు. కేంద్రం నిధులు సమకూరిస్తే తప్ప నడిచే అవకాశం లేని సంస్థలను వదిలిపెట్టి నిక్షేపంలా ఉండే సంస్థలను ప్రైవేటు పరం చేయడమేమిటన్నది వారి ప్రశ్న. ఎల్ఐసీ ఏ రోజూ ఆర్థికంగా ఇబ్బందుల్లో పడలేదు. ప్రభుత్వాన్ని ప్రాధేయపడలేదు. సరిగదా... నష్టాల్లో మునిగిన అనేక పబ్లిక్ రంగ సంస్థల్ని బతికించడానికి దాని నిధులే అక్కరకొస్తున్నాయి. వివిధ మౌలిక సదుపాయరంగ ప్రాజెక్టులకు అవస రమైన నిధులు సమీకరిస్తూనే, ద్రవ్యలోటు రాకుండా చూడటానికి ఎల్ఐసీలోనూ, ఐడీబీఐలోనూ ఉన్న వాటాలను కేంద్రం విక్రయించదల్చుకుంది. ఈ వాటాల విక్రయం ద్వారా రూ. 90వేల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇది ఏమేరకు సాధ్యమో చూడాల్సివుంది. అయితే ద్రవ్య లోటును నిర్దేశించిన పరిమితికి లోబడివుండేలా చూడాలన్న లక్ష్యంలో సంక్షేమ పథకాలకు కోతపడకుండా చూడటం ముఖ్యం. ప్రజల్లో వినిమయాన్ని పెంచి, డిమాండ్ పెరిగేలా చేసినప్పుడే తయారీ రంగం కోలుకుంటుంది. అందు కవసరమైన మరిన్ని చర్యలు తీసుకుంటేనే వృద్ధి రేటు నిర్మలా సీతారామన్ ఆశించినట్టు 10 శాతానికి చేరుతుంది. ఇకపోతే ఎల్ఐసి లాంటి బీమా సంస్థల్లో ప్రజలు పెద్ద మొత్తంలో చేరేలా... అలా చేరితే రాయితీలు ఇచ్చేలా ఆదాయపన్నులో వెసలుబాటు ఉండాలి. కానీ అలా జరక్కపోవడం అన్నది ప్రైవేట్ సంస్థల ప్రోద్బలం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇకపోతే ఆదాయపన్నుకు సంబంధించి కేంద్ర ఆర్థికమంత్రి చేసిందల్లా ఏది కావాలో ఎంచుకునే స్వేచ్ఛ వేతన జీవులకివ్వడమే. ఏ కత్తి మెత్తగా తెగుతుందో ఎవరికి వారు తేల్చుకోవాల్సివుంటుంది. నిపుణులు చెబు తున్నదాన్నిబట్టి ఈ చర్య వల్ల ఆదాయం పన్ను గణన, రిటర్న్ల దాఖలు ఎంతో సంక్లిష్టంగా మారాయి.

కొత్త శ్లాబుల్లోకి మారదల్చుకున్నవారికి నిరాకరిస్తున్న మినహాయింపులు హేతుబద్ధంగా అనిపించడం లేదు. తరూ. 15 లక్షల వార్షిక ఆదాయం ఉండేవారికి పాత విధానంలో రూ. 2,73,000 ఆదాయం పన్ను చెల్లించాల్సివస్తే... కొత్త విధానం ప్రకారం రూ. 1,95,000 చెల్లిస్తే సరిపోతుంది. అంటే కొత్త విధానంలో రూ. 78,000 మిగులుతుంది. కానీ అదే సమయంలో వారు గృహ రుణంపై చెల్లించే వడ్డీ, బీమా ప్రీమియంలు, పిల్లల చదువులకయ్యే ఫీజులు, పీపీఎఫ్ వంటివాటిపై ఇప్పు దున్న మినహాయింపులన్నీ కోల్పోతారు. ఇవే కాదు... 80జీ కింద విరాళాలపై ఉండే మినహాయింపు, 80 జీజీ కింద నెలకు రూ. 5,000 వరకూ ఉండే మినహాయింపు మాయమవుతాయి. ఇలా దాదాపు 70కి పైగా మినహాయింపులను తొలగించారు. ఇకపోతే గృహ నిర్మాణరంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో మినహాయింపులు తొలగించడం ఆ రంగానికి చేటు కలిగించడం ఖాయంగా కనిపిస్తుంది. అలాగే బీమా ప్రీమియంలు చెల్లించేవారికిచ్చే మినహాయింపులు కూడా కొత్త విధానంలో కనుమరుగయ్యాయి. ఆదాయం పన్ను మినహాయింపు కోసం అధిక శాతంమంది ఆశ్రయించేది బీమా ప్రీమియంలు చెల్లించడం. ఆ మినహాయింపు కాస్తా ఎత్తేస్తే, ఎవరైనా బీమా జోలికి వెళ్తారా? అన్నది ప్రశ్న. వీటన్నిటిపై బడ్జెట్ చర్చలో సమాధానం ఇవ్వాల్సి ఉంది.

# పంచాయితీల్లో పేరుకుపోతున్న విద్యుత్ బిల్లులు

### మీటర్లు లేకపోవడంతో అధిక ఛార్జీలు వసూళ్లు

### ట్రాన్స్కో తీరుపై సర్పంచ్ల మండిపాటు

మహబూబ్నగర్,ఫిబ్రవరి 4(ఆర్ఎన్ఎ): విద్యుత్, పంచాయతీ శాఖల మధ్య పెండింగ్ బిల్లుల చెల్లింపు అంశంలో వివాదం నడుస్తోంది. మీటర్లు లేకుండా బిల్లులు ఎలా తయారు చేస్తున్నారని పంచాయతీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. చాలా పంచాయతీల్లో మీటర్లు ఏర్పాటు చేయలేదని, మీటర్లు ఉన్నా ఆన్ ఆఫ్ స్విచ్లు లేవని అంటున్నారు. మీటర్లు ఏర్పాటు చేసి బిల్లులు వేయాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ బకాయిలు ప్రభుత్వానికి భారంగా మారాయి. దీంతో చెల్లింపులు సక్రమంగా లేని పంచాయతీలు, మున్సిపాలిటీలకు నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైతే విద్యుత్ సరఫరాను నిలిపేసే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నారు. పంచాయతీల వారీగా బిల్లులు తయారు చేసి పంచాయతీ అధికారులు, సర్పంచులను స్వయంగా కలిసి చెల్లింపుల జరిగే విధంగా చూస్తున్నారు. కలెక్టర్ల ఆదేశాల మేరకు 210 పంచాయతీల అధికారులు అక్టోబరు, నవంబరు నెలల విద్యుత్ బకాయిలు చెల్లించారు. రెగ్యులర్ బిల్లుల పేచీ లేకున్నా పెండింగ్ బిల్లుల చెల్లింపులపై పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకొని భారం లేకుండా చూడాలని సర్పంచులు కోరుతున్నారు. గృహ అవసరాలతో పాటు వివిధ వ్యాపార,వాణిజ్య రంగాలకు నిరంతరం వీటన్నింటికీ విద్యుత్ సరఫరా జరుగుతున్నా బిల్లుల చెల్లింపుల్లో చాలా తేడాలు వస్తున్నాయి. ట్రాన్స్కో సరఫరా చేస్తున్న విద్యుత్, వసూలు అవుతున్న బిల్లులకు ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలు, మునిసి పాలిటీలు వాడుకున్న విద్యుత్కు తగినట్టుగా బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గద్వాల జిల్లాలోని 12 మండలాల్లో ఉన్న 255 పంచాయతీలకు సంబంధించి విద్యుత్ బకాయిలు రూ.80,08,17,043 ఉన్నాయి. అలాగే నాలుగు మని టసిపాలిటీలు కలిపి రూ.39,57,91,568 ఉన్నా యి. ఇలా పేరుకుపోయిన బకాయిలను వసూలు చేసుకునేందుకుగాను ట్రాన్స్కో కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు నడుంబిగించింది. ఫిబ్రవరి నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా బిల్లులు చెలిస్తే సరి లేకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. బిల్లుల చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో ట్రాన్స్కో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతోందని ఆ శాఖ అధికారులు అంటున్నారు.

## శిథిలావస్థలో పాత పాఠశాల

### బాగుచేయాలని కోరుతున్నా పట్టించుకోని పాలకులు

ఖమ్మం,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): పాల్వంచ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలకు ఉన్న ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో రాత్రి వేళల్లో ఆకతాయిలు గోడదూకి శిథిలభవనాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా రు.పాఠశాలకు వంట షెడ్డులేకపోవటంతో ఉన్నగదుల్లోనే మధ్యాహ్న భోజనం వండుతున్నారు. పాఠశాల భవనాల్లో పిల్లలు తరచూ ఆడుకుంటున్నారు. వారిని కట్టడి చేయటం కష్టసాధ్యంగా మారుతుంది. పాఠశాల సెలవుల సమయాల్లో ప్రాంగణంలోని ఎవరెవరో వస్తున్నారు. భవనాలు ఎప్పుడు కూలుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. శిథిల భవనాలను కూల్చాలని జిల్లా విద్యాశాఖ అధికారి సరోజినీదేవి ఇటీవల పాఠశాలను సందర్శించినప్పుడు కోరారు. ఐదు దశాబ్దాల క్రితం జలగం వెంగళరావు హయాంలో నిర్మించిన ఈ పాఠశాలలో ప్రస్తుత ఖమ్మం ఎంపీ, టీఆర్ఎన్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు నామా నాగేశ్వరరావుతో పాటు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చదువుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదులు శిథిలావస్తకు చేరుకున్నాయి. ఇక్కడ చదువుకున్న వందల మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. విదేశాల్లోనూ స్థిరపడ్డారు. పాఠశాల జీవితకాలం ముగియటంతో కొత్త భవనాలు నిర్మించినా పాత భవనాలను తొలగించక పోవటంతో ఆభవనాలు ఎప్పుడు

కూలుతాయోననే ఆందోళన పాఠశాల ఉ ఎా ద ్ర ా య య ు ు ల న ం వెంటాడుతోంది. విద్యార్థులు కూడా గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నట్టు ఉపాధ్యాయులు వాపోతున్నారు. అప్పట్లో ఎంతో విలువయిన టేకు కిటికీలు, దర్వాజాలు ఏర్పాటు చేయగా వాటిని దొంగలు ఎత్తుకపోతున్నారు. తోణం వీటిని బాగు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## నర్సాపూర్లో ఊపందుకున్న రియల్ బూమ్

### ఎకరా కోటి అంటున్న రైతులు

### భూములకు ధరలతో అన్నదాతల్లో ఆనందం

మెదక్,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): హైదరాబాద్కు చేరువగా ఉన్న నర్సాపూర్లో రియల్ బూమ్ ఊపందుకుంది. ఇప్పుడు ఎక్కడ చూసినా వెంచర్లు వెలుస్తున్నాయి. రాష్ట్ర రాజధానికి కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ ప్ఆరంత భూములకు డిమాండ్ పెరిగింది. ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ బీటీలుగా మారడంతో రవాణా సౌకర్యం పెరిగింది. దీంతో హైదరాబాద్లో రియల్ వ్యాపారం చేసే వారితో పాటు బడావ్యక్తులు ఇక్కడి భూములపై కన్నేశారు. నియోజకవర్గంలో ప్రధాన రోడ్లకు ఆనుకున్న భూములు ఎకరాకు రూ.కోటి పలుకుతుండగా.. గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఆనుకుని ఉండే భూములు ఎకరాకు రూ.50 లక్షలకుపైగా పలుకుతుంది. దూరంగా ఉండే భూములు రూ.30 లక్షలకు పలుకుతున్నాయి. నర్సాపూర్లో ఇంటి స్థలాలైతే హైదరాబాద్ను మించి ఉన్నాయి. దీనికి కారణం పట్టణం చుట్టూ అటవీ ప్రాంతం ఉండడంతో పాటు ప్రభుత్వ భూమి ఉంది. పట్టా భూములు తక్కువగా ఉండడంతో ఉన్న కొద్దిపాటి భూమికి ఆకాశాన్నంటే ధరలు ఉన్నాయి. పట్టణంలో గజానికి ప్రధాన రోడ్డు సమీపంలో రూ.20 వేలు, లోపల రూ.10 వేలకు తక్కువ ఎక్కడా లభించడం లేదు. దీంతో సామాన్య, మధ్య తరగతి వారు భూములు కొనలేని పరిస్థితిలో ఉన్నారు. నర్సాపూర్ పట్టణంలో మొన్నటి వరకు వ్యవసాయ భూములుగా ఉన్నవన్నీ నేడు ఇంటి స్థలాలుగా మారి నిర్మాణాలు జరుగుతున్నాయి. కొంతకాలంగా సరైన వర్షాలు లేకపోవడంతో ఉన్న భూమిని అమ్ముకుని కుటుంబాన్ని అయినా పోషించుకుందామని రైతులు అమ్మకానికి సిద్ధమవుతున్నారు. స్థానికేతరులు భూములు కొనుగోలు చేసి వాటికి చుట్టూ హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు పూలచెట్లు, పండ్ల తోటలు పెంచుతుండగా.. మరికొందరు వాణిజ్య పంటలు వేసుకుంటున్నారు. మాదాపూర్, తుల్జారాంపేట, గూడెంగడ్డ, కాగజ్మద్దూర్, ఆవంచ, నారాయణపూర్ గ్రామాల పరిధిలోని ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న 60 శాతానికిపైగా భూములను స్థానికేతరులు, బడాబాబులు, రియల్ వ్యాపారులు కొనుగోలు చేశారు. భూములకు మంచి డిమాండ్ ఉండడంతో చాలామంది నాయకులు ఈ వ్యాపారంలోనే మునిగి తేలుతున్నారు.

## గ్రామాల్లో సహకార ఎన్నికల సందడి

### –పదవుల కోసం అధికార పార్టీ నేతల యత్నాలు

సిరిసిల్ల,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందడి ముగియగా తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్,బీజేపీ నాయకులు ఎన్నికలపై దృష్టిపెట్టడంతో మరోసారి ఎన్నికల వేడి రాజుకుంది. సహకార ఎన్నికలకు షెడ్యూల్ జారీకావడం, నోటిఫికేషన్ వెలువడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సందడి ఏర్పడింది. పార్టీలకతీతంగా జరిగే ఎన్నికలైనా టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ తన ప్రాబల్యాన్ని చాటుకోవడానికి దృష్టి సారించాయి. గ్రామాల్లో తమ పార్టీ వర్గీయులకు పదవులు దక్కే విధంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటుకు సిద్దమయ్యారు. అధికార పార్టీలో కొంతమందికి పదవులను అందించాలనే భావనతో ముందుగానే సింగిల్విండో చైర్మన్, వైస్చైర్మన్ల పదవులను ఇచ్చే విధంగా చూస్తుండడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి కనిపిస్తోంది. విండో పదవుల కోసం గ్రామాల్లోని పెద్దలు పార్టీ నాయకులు చుట్టూ తిరుగుతున్నారు. సోమవారం సహకార ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో అధికార పార్టీ నేతల్లో హడావిడి మొదలయ్యింది. ఈ 6 నుంచి 8వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ అనంతరం 9న పరిశీలన, 10న ఉపసంహరణలు, గుర్తుల కేటా యింపు చేస్తారు. 15న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ నిర్వహించి, సాయయంత్రం ఫలితాలు వెల్లడిస్తారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రిజర్వేషన్లను కూడా ఖరారు చేస్తున్నారు. జిల్లా సహకార శాఖ అధికారులు ఓటరు లిస్టులు, రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బంది నియామకంపై దృష్టి పెట్టారు. కొత్తగా వచ్చిన సహకార నిబంధన లు పరిగణలోకి తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 23 సొసైటీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఓటరు జాబితాలను, రిజర్వేషన్లను ప్రకటించనున్నారు. ప్రతి సొసైటీ పరిధిలో 13 డైరెక్టర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. దీనిప్రకారం జిల్లాలో 299 డైరెక్టర్ పదవులున్నాయి. ప్రతి డైరెక్టర్ స్థానానికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న హెడ్ మాస్టర్లను ఆర్వోలుగా నియమిస్తున్నారు. మరి కొంతమంది ఉద్యోగులను సిబ్బందిగా తీసుకోనున్నారు. 13 మంది డైరెక్టర్లలో ఒకరు చైర్మన్గా, మరొకరు వైస్చైర్మన్గా ఎంపికచేస్తారు.

## సంపూర్ణ అక్షరాస్యతకు యత్నాలు

### –సిఎం కెసిఆర్ పిలుపుతో కార్యాచరణ

జగిత్యాల, ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): జగిత్యాల జిల్లాను సంపూర్ణ అక్షరాస్యతగా మార్చేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. 'ఈచ్ వన్ టీచ్ వన్' నినాదంతో ముందుకు వెళ్లాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునివ్వడంతో అందుకు తగినట్లుగా జగిత్యాల జిల్లాలో అధికారులు ప్రణాళిక రూపొంది

స్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇటీవల జరిగిన రెండవ విడత ప్లలె ప్రగతిలో గ్రామీణ ప్రాంతాల్లోనే 77,836 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లుగా గుర్తించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈచ్ వన్ టీచ్ వన్ కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునివ్వగా జిల్లాలో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

గ్రామాల్లో జరిగిన రెండవ విడత ప్లలె ప్రగతిలో కలెక్టర్ శరత్ ఆదేశాల మేరకు నిరక్షరాస్యతపై సర్వే చేయించగా, జిల్లాలో 77,836 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. రానున్న రోజుల్లో వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జగిత్యాల జిల్లాను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.జిల్లాలో 18 మండలాలు ఉండగా, మొత్తం 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలతో పాటు మహిళా స్వ శక్తి సంఘాల సహకారంతో జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 60.58 శాతం మేరకు అక్షరాస్యత ఉంది. జిల్లా జనాభా 9,85,417 మంది ఉండగా, ఇందులో పురుషులు 4,84, 079 మంది కాగా, మహిళలు 5,01,338 మంది ఉన్నారు. అక్షరాస్యులు 5,37,636 మంది ఉన్నారు. దీంతో అక్షరాస్యత శాతం 60.58 శాతం మేరకు ఉన్నట్లయింది. పురుషుల్లో అక్షరాస్యత శాతం 70.31, స్త్రీలలో 50.66 శాతం ఉంది. ఈ లెక్కన పురుషుల అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉండగా, మహిళల అక్షరాస్యత శాతం తక్కువగా ఉంది. జిల్లాలో అక్షరాస్యత ఎక్కువ కలిగిన మండలంగా 77.53 శాతంతో జగిత్యాల మండలం గుర్తింపు పొందింది. ఇక్కడ పురుషుల అక్షరాస్యత శాతం 85.84 శాతం మేరకు ఉండగా, స్త్రీల అక్షరాస్యత శాతం 69.32గా ఉంది. జగిత్యాల జిల్లాలో సాక్షరభారత్ కార్యక్రమం వల్ల కొంత మేరకు అక్షరాస్యత పెరిగింది. 2018, మార్చి 31తో సాక్షరభారత్ కార్యక్రమం ముగిసింది. అయితే ఇప్పుడు ఎక్కడ సాక్షరభారత్ కేంద్రాలు నడవడం లేదు. మరికొద్ది మాసాల పాటు నిర్వహించినట్లయితే జగిత్యాల జిల్లా సంపూర్ణ అక్షరాస్యతగా మారే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థుల సహకారంతో జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# విభజన హామీలు నెరవేర్చాలి

## –కేంద్రమంత్రిని కలసిన వైకాపా ఎంపిలు

న్యూఢిల్లీ,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. కడప స్టీల్ ఫ్యాక్టరీ, రామాయపట్నం పోర్టు నిర్మాణానికి కేంద్రం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొన్న సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. భవనాల నిర్మాణం పేరుతో గత ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేసిందని ఎంపీ మిథున్ రెడ్డి ఆరోపించారు. కొన్ని ప్రాజెక్టులకు రివర్స్ టెండరింగ్ నిర్వహించి ప్రజాధనం ఆదా చేశామని చెప్పుకొచ్చారు. పాత కాంట్రాక్టర్లే మళ్లీ తక్కువ ధరకు టెండర్ వేశారని తెలిపారు. జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసిన తొలి సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. పోలవరాన్ని త్వరగా పూర్తి చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టాలని ఎంపీ కోరారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సోమవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. మంత్రిని కలిసినవారిలో ఎంపీలు మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, ఎన్ రెడ్డప్ప, తలారి రంగయ్యలు ఉన్నారు. ఈ భేటీ అనంతరం మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర మంత్రిని కలిసినట్టు తెలిపారు. కృష్ణపురం ఉల్లి సమస్యను మంత్రికి వివరించామని చెప్పారు. రైతులు నవంబర్ నుంచి ఉల్లి ఎగుమతి కోసం ఎదురు చూస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉల్లి ఎగుమతికి సంబంధించి సీఎం వైఎస్ జగన్ కేంద్రానికి లేఖ కూడా రాశారని మిథున్‌రెడ్డి గుర్తుచేశారు. తమ వినతిపై పీయూష్ గోయల్ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. త్వరలోనే ఉల్లి ఎగుమతికి అనుమతి వస్తుందని చెప్పారు.

# సాగర్ మాల ప్రాజెక్ట్ కింద రోడ్,రైల్ ప్రాజెక్టులు

## –రాజ్యసభలో మంత్రి మాండవీయ వెల్లడి

న్యూఢిల్లీ,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): సాగరమాల కార్యక్రమం కింద దేశంలో కొత్తగా అభివృద్ధి చేయడానికి తలపెట్టిన 91 రోడ్డు, 83 రైల్ ప్రాజెక్ట్‌లలో ఆంధ్రప్రదేశ్‌కు 32 రోడ్డు, 21 రైల్ ప్రాజెక్ట్‌లు కేటాయించినట్లు నౌకాయాన శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పోర్టులకు సరకుల రవాణాను వేగవంతం, సులభతరం చేసే పక్రియలో భాగంగా రోడ్డు, రైల్ ప్రాజెక్ట్‌లు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. రోడ్డు ప్రాజెక్ట్‌లలో కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. మరికొన్ని డీపీఆర్ రూపకల్పన దశలో ఉన్నాయని ఆయన వివరించారు. రైల్ ప్రాజెక్ట్‌లలో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు చెప్పారు. సాంప్రదాయ పరిశ్రమలను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధితో ఒక పథకాన్ని ప్రారంభించినట్లు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో చెప్పారు. సభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ ఈ పథకంలో భాగంగా ఖాదీ, కాయర్, విలేజ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో సాంప్రదాయక పరిశ్రమల క్లస్టర్లను ఏర్పాటు చేసి అందుకు తగిన ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు (కలంకారీ ఉత్పాదనలు), విజయనగరం (కాయర్ పరుపుల తయారీ), చిత్తూరు (కాయర్ ఉత్పాతదనలు), కృష్ణా (కొండపల్లి బొమ్మలు), తూర్పు గోదావరి (జొన్నాడ ఫుడ్ ప్రాసెసింగ్), చిత్తూరు (చింతపండు ఉత్పాతదనలు), గుంటూరు (మంగళగిరి బంగారు ఆభరణాల తయారీ), తూర్పు గోదావరి (కొబ్బరి నార ఉత్పాదనలు), తూర్పు గోదావరి (కడియపులంక కొబ్బరిపీచు ఉత్పాదనలు) జిల్లాల్లో మొత్తం 9 సాంప్రదాయ పరిశ్రమల క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# రేప్ కేసులో చిన్మయానందకు బెయిల్

అలహాబాద్,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): బీజేపీ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి స్వామి చిన్మయానందకు బెయిల్ మంజూరైంది. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ అలహాబాద్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ఓ న్యాయశాస్త్ర విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడినట్టు స్వామి చిన్మయానంద ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. తనపై స్వామి చిన్మయానంద లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఓ వీడియోలో ఆరోపించిన బాధితురాలు తర్వాత అదృశ్యం కావడంతో.. గతేడాది ఆగస్టు 28న పోలీసులు చిన్మయానందపై కేసు నమోదు చేశారు. నెలరోజుల తర్వాత స్వామి చిన్మయానంద, బాధితురాలు ఇద్దరినీ పోలీసులు విడివిడి కేసుల్లో అరెస్ట్ చేశారు. కాగా చిన్మయానంద అరెస్ట్ అయిన కొద్ది రోజులకే ఆయనతో తమ పార్టీకి సంబంధం లేదంటూ బీజేపీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# బిజెపి నేత రఘునంద్ రావుపై అత్యాచార కేసు

## –పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత మహిళ

హైదరాబాద్,ఫి(బ్రవరి3(ఆర్ఎన్ఎ): రాష్ట్ర బీజేపీ నేత అధికార ప్రతినిధి ఎం రఘునందన్ రావుపై ఓ మహిళ సంచలన ఆరోపణలు చేసింది. రఘునందన్ రావు తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ సైబరాబాద్ సీపీ సజ్జనార్‌కి మహిళ ఫిర్యాదు చేసింది. విడాకుల విషయంలో తన ఆఫీసుకు పిలిచిన రఘునందన్ రావు.. మత్తుమందు కలిపిన కాఫీ ఇచ్చి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాధిత మహిళ ఆరోపించింది. దాన్ని అడ్డుపెట్టుకుని ఇప్పుడు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. తనకు న్యాయం చేయాలని సీపీని బాధితురాలు వేడుకుంది. రఘునందన్ రావు దురాగతంపై ఇప్పటికే రాష్ట్ర మానవ హక్కుల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. తనను బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరిస్తున్నారని తనఫిర్యాదులో పేర్కొంది.

# కాజీపేట జంక్షన్‌ను డివిజన్ స్థాయికి అప్ గ్రేడ్ చేయాలి

## తక్షణమే కోచ్ ఫ్యాక్టరీని నిర్మించాలి

## కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను కోరిన వినయ్ భాస్కర్

న్యూఢిల్లీ,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): కాజీపేట జంక్షన్‌ను డివిజన్ స్థాయికి అప్ గ్రేడ్ చేయాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను కోరినట్లు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్, ఆర్కియాలజీ డైరెక్టర్ జనరల్‌ను కలిశారు. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. తన నియోజకవర్గం పరిధిలో రైల్వే ప్రాజెక్టు, చరిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వాటి అభివృద్ధిపై వారితో చర్చించినట్లు చెప్పారు. విభజన చట్టంలోని హామీ మేరకు కాజీపేటలో తక్షణమే కోచ్ ఫ్యాక్టరీని నిర్మించాలని కోరామన్నారు. కాజీపేట స్టేషన్‌లో కొన్ని రైళ్ల హాల్ట్ జరగాల్సి ఉందన్నారు. వరంగల్‌లో ఉన్న రైల్వే స్టేడియంను అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా వేయి స్తంభాల ఆలయ అభివృద్ధి విషయమై ఆర్కియాలజీ అధికారులను కూడా కలిశామని వినయ్ భాస్కర్ తెలిపారు. సాంకేతిత పరిజ్ఞానంతో కూలిన వాటిని తిరిగి నిర్మించాలని కోరామన్నారు. నిధులు కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. తాము చేసిన అభ్యర్థనలకు ఇరువురూ సానుకూలంగా స్పందించినట్లు వినయ్ భాస్కర్ చెప్పారు. వరంగల్ నగరంలో పర్యాటకం అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ నగరంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేశామని చెప్పారు. కేంద్రం కూడా సహాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# హత్యకేసులో 22 ఏళ్లుగా పరారీలో నిందితుడు

## –అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచిన పోలీసులు

భద్రాద్రి కొత్తగూడెం,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): హత్య కేసులో 22 సంవత్సరాలుగా పరారీలో ఉన్న నిందితుడిని కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ సునీల్ దత్ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికై పరారీలో ఉన్న నిందితుల సమాచారాన్ని సేకరించి అదుపులోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే 1994వ సంవత్సరంలో కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 9 ఇంక్లైన్ నందు జరిగిన హత్య కేసులో నిందితుడు ప్రహ్లాద్ మౌర్య అనే వ్యక్తిని మణుగూరు నందు గల శివలింగాపురం కాలనీలో అరెస్టు చేసినట్లు కొత్తగూడెం టూటౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు. 1998 నుంచి 22 సంవత్సరాలుగా పరారీలో ఉండి కోర్టులో హాజరు కాకుండా ఢిల్లీ ,ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో తల దాచుకుని గత 6 నెలల క్రితం మణుగూరు చేరుకుని నివాసముంటూ తప్పించుకుని తిరుగుతున్నాడు. నిందితుడు ప్రహ్లాద్ మౌర్యను అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం ఖమ్మం సెషన్స్ కోర్టు ఎదుట హాజరుపరచడం జరిగిందని సిఐ తెలిపారు. దీర్ఘకాలంగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచిన టూటౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బందిని జిల్లా ఎస్పీ సునీల్ దత్ అభినందించారు.

# ఢిల్లీ అభివృద్ధికి ఓటేయండి

## బిజెపితోనే మార్పులకు అవకాశం

## ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకున్న ఘనత బిజెపిది

## విపక్షాలకు తాను దూకుడుగా వెళ్లడం ఇష్టం లేదు

## హస్తిన ప్రచారంలో ప్రధాని మోడీ పిలుపు

న్యూఢిల్లీ,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): అభివృద్ధిని, మార్పును కోరుకుంటున్న ఢిల్లీ ప్రజలు ప్రజాస్వామ్య పండుగైన ఫి(బ్రవరి 8న పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొని, బీజేపీని, ఎన్డీయేను గెలిపించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈస్ట్ ఢిల్లీలోని కర్కార్‌డూమలో సోమవారం జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ, దేశ రాజధానిలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనధికార కాలనీవాసులకు యాజమాన్య హక్కులను కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. అన్ని అవంతరాలను అధిగమించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలోని అనధికార కాలనీలను చట్టబద్ధం చేస్తూ పార్లమెంటులో చట్టం తీసుకువచ్చిందన్నారు. ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వస్తే, ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని, పౌర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ ప్రజల ఓటు దేశంలో తమ ప్రభుత్వం చేపడుతున్న మార్పులకు బలం చేకూరుస్తుందని, ఢిల్లీ ఆధునికీకరణకు ఊతమిస్తుందని అన్నారు. మోదీ తన ప్రసంగంలో కేజీవ్రాల్ సర్కార్ పనితీరుపై విమర్శలు గుప్పించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనను ఢిల్లీ సర్కార్ అమలు చేయలేదని, ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం సంక్షేమ పథకాల అమలును అడ్డుకుంటూనే ఉంటుందని మోదీ విమర్శించారు. రాజకీయాల చేయడం మినహా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి ఏమీ తెలియదన్నారు. విపక్షాలు కేవలం బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని తప్పుపట్టారు. షహీన్‌భాగ్ ప్రస్తావన చేస్తూ 'ఇండియాను విడగొట్టే' శక్తులకు మద్దతుగా నిలుస్తున్నాంటూ ఆప్, కాంగ్రెస్ రాజకీయాలను ఆయన ఎండగట్టారు. ఈ నిరసనల వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీఏఏపై ఆప్, కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నాయని మోదీ ఆరోపించారు. ఢిల్లీ అభివృద్ధి కోసం, మార్పుకోసం ఫి(బ్రవరి 8న ప్రజలు తమ ఓటుతో బీజేపీకి, ఎన్డీయేకి పట్టం కట్టాలని కోరారు. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుండటం విపక్షాలకు ఇబ్బందిగా మారిందని, విపక్షాలకు ఇలాంటి ఇబ్బంది ఎదురుకావడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తూ విపక్షాలపై తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విపక్షాల ఆరోపణల్లా.. మోదీ చాలా వేగంగా వెళ్తున్నారు. నెమ్మదిగా పనిచేయండి, ఒకటి తర్వాత ఒకటి పెద్ద పెద్ద నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారు? ఆ అవసరం ఏమొచ్చింది?' అని వారంటున్నారని మోదీ వివరించారు. కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల ఫిర్యాదు దేశ చరిత్రలో ఇదే మొదటిసారని ఆయన అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వరుసగా తీసుకున్న కీలకమైన నిర్ణయాలను ఆయన ప్రస్తావిస్తూ... '70 ఏళ్ల తర్వాత 370 అధికరణను రద్దు చేశాం. 70 ఏళ్ల తర్వాత రామజన్మభూమి తీర్పు వచ్చింది. కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ 70 ఏళ్ల తర్వాత తెరుచుకోవడం జరిగింది. 70 ఏళ్ల తర్వాత సీఏఏ వచ్చింది. యుద్ధ స్మారకం, పోలీస్ మెమోరియల్ 50 నుంచి 60 ఏళ్ల తర్వాత సాకారమైంది' అని అన్నారు. త్రిపురలో బ్రూ రెఫ్యూజీల సెటిల్‌మెంట్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ ఏర్పాటు, జీఎస్‌టీలపై కూడా విపక్షాల తీరును ప్రధాని ఎండగట్టారు. త్రిపురలో బ్రూ రెఫ్యూజీల సెటిల్‌మెంట్‌కు ఎన్నేళ్లు తీసుకోవాలి? 23 ఏళ్ల తర్వాత..., చీఫ్ ఆఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ ఏర్పాటు 20 ఏళ్ల తర్వాత... దేశంలో జీఎస్‌టీ ఎన్నేళ్ల తర్వాత వచ్చింది? 17 ఏళ్ల తర్వాత' అని ప్రధాని లెక్కలు చెప్పారు. బీజేపీ ఏదైతే చెప్పిందే అది చేసి తీరుతుందని, ఢిల్లీని సరికొత్త పుంతలు తొక్కిస్తామని, ప్రజల ఆకాంక్షలను నెరవర్చిందుకే తాము ప్రాధాన్యం ఇస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ఆశావహ దృక్పథాన్నే తాము నమ్ముతామని, నిరాశావాదానికి దూరమని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం మన వారసత్వమని, దానికి ప్రతీక మన దేశ రాజధాని అని మోదీ కొనియాడారు.ఆయన వెంట పలువురు బిజెపి ప్రముఖులు ప్రచారంలో పాల్గొన్నారు.

# కర్నాటక బిజెపి ఎంపి వివాదాస్పద వ్యాఖ్యలు

## పరోక్షంగా గాంధీ పోరాటంపై విమర్శలు

## తప్పుపట్టిన విపక్షాలు ..క్షమాపణలు చెప్పాలన్న బిజెపి

బెంగళూరు,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): కర్ణాటక బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడ దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నేరుగా మహాత్మా గాంధీ పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా ఆయన స్వాతంత్ర్య పోరాట తీరుపై విమర్శించారు. దీంతో బీజేపీ అధిష్ఠానం ఆయన వ్యాఖ్యలను ఖండించింది. తక్షణం క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. శనివారం నాడు బెంగళూరులో జరిగిన ఓ సమావేశంలో ఉత్తర కన్నడ నియోజకవర్గ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి అనంతకుమార్ ప్రసంగించారు. 'కొంత మంది సో కాల్డ్ లీడర్స్ చేసిన స్వాతంత్ర్య పోరాటమంతా పెద్ద డ్రామా. బ్రిటిష్ అనుమతి, మద్దతులో చేసిన పోరాటం అది. ఏ ఒక్క రోజూ ఈ నాయకులపై బ్రిటిష్ పోలీసులు లాఠీ చార్జ్ చేయలేదు. వీరికి ఒక్క లాఠీ దెబ్బ కూడా తగలలేదు. అసలు ఆ నాయకులది నిజమైన పోరాటం కాదు. బ్రిటిషర్లతో ఒప్పందం ప్రకారం అనుకుని చేసిన ఫైట్ అని అన్నారు. సత్యాగ్రహం, నిరాహార దీక్షల వల్లే దేశానిక స్వాతంత్రం వచ్చిందని కాంగ్రెస్ పార్టీని సపోర్ట్ చేసే వాళ్లంతా చెబుతుంటారని, కానీ అది అబద్ధమని అన్నారు. బ్రిటిషర్ల భారతదేశాన్ని విడిచి వెళ్లింది సత్యాగ్రహం వల్ల కాదని, ఫ్రస్టేషన్‌తో స్వాతంత్రం ఇచ్చారని చెప్పారాయన. కానీ, దేశంలో అలాంటి నేతల్ని మహాత్మ అని పిలివాల్సి వస్తోందని, చరిత్ర చదివేటపుడు తన రక్తం మరిగిపోతుందని ఎంపీ అనంతకుమార్ హెగ్డే అన్నారు. ఎంపీ అనంత కుమార్ వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. గాంధీజీపై బీజేపీకి ఉన్న గౌరవం ఏంటో తెలిసిపోయిందంటూ పలువురు విపక్ష నేతలు విమర్శలు చేశారు. బీజేపీ వాళ్లు దేశ స్వాతంత్రం గురించి పోరాడలేదని, ఎప్పుడూ దేశం కోసం త్యాగాలు చేయలేదని కాబట్టి వాళ్లు ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ అన్నారు. వాళ్ల మైండ్ సెట్ ఏంటన్నది దీని బట్టి తెలిసిపోతోందని అన్నారు. బీజేపీ వాళ్లు గాంధీజీ పేరు వాడుకోవడం తప్ప ఆయనపై గౌరవం లేదని తెలుస్తోందని అన్నారు.

పార్టీకి సంబంధం లేదన్న బీజేపీ

అనంతకుమార్ వ్యాఖ్యలతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని బీజేపీ సీనియర్ నేతలు చెప్పారు. అవి పూర్తిగా అనంతకుమార్ వ్యక్తిగత వ్యాఖ్యలని, వాటిని పార్టీ ఖండిస్తోందని అన్నారు. ఆయన క్షమాపణ చెప్పాలని అధిష్టానం ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రపంచం మొత్తానికి గాంధీజీ గురించి తెలుసని, అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం కావచ్చుని బీజేపీ నేత జగదంబిక పాల్ చెప్పారు. అలాగే కేంద్ర మంత్రి అశ్వని చౌబే మాట్లాడుతూ గాంధీజీని దేశమంతా ఎంతగానో గౌరవిస్తుందని, అనంతకుమార్ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని అన్నారు. బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలపై బాపూజీ మనవడు తుషార్ గాంధీ స్పందించారు. మహాత్మా గాంధీ ఫ్రీడం ఫైట్ డ్రామా అని హెగ్డే అన్న మాటలు కరెక్టేనని, అయితే అది చాలా తీవ్రంగా జరిగిందని అన్నారు. ఆ డ్రామానే అనైతికంగా భారతీయులను బానిసలుగా మార్చుకున్న సామ్రాజ్యవాద బ్రిటిష్ శక్తుల కళ్లు తెరిపించిందని చెబుతూ ట్వీట్ చేశారు.

# మైనింగ్ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు

## అనధికారిక మైనింగ్ పై ఉక్కుపాదం

## పెండింగ్ లో వున్న దరఖాస్తులకు అనుమతులు

## పోలవరం కాలువ గట్లపై గ్రావెల్, మెటల్ విక్రయాలకు టెండర్లు

## 'ప్రైవేటు'కు చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో మైనింగ్ లీజుల వసూళ్ళు

## మైనింగ్ శాఖపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమీక్ష

అమరావతి,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వంకు మైనింగ్ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మైనింగ్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. సచివాలయంలో మైనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి రామ్ గోపాల్ తో పాటు పలువురు మైనింగ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనింగ్ లీజులు, సీనరేజీ ద్వారా ప్రభుత్వానికి వస్తున్న రెవెన్యూ పై సమీక్షించారు. మైనింగ్ కోసం పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అవసరమైన అనుమతులు ఇవ్వాలని సూచించారు. అలాగే పోలవరం కుడి, ఎడమ కాలువల గట్లపై వున్న గ్రావెల్, మెటల్ నిల్వలను బ్లాక్ లుగా వర్గీకరించి టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఇప్పటికే ఇరిగేషన్, మైనింగ్ అధికారుల సంయుక్త తనిఖీలో సుమారు ఆరు కోట్ల క్యూబిక్ మీటర్ల గ్రావెల్, మెటల్ నిల్వలను గుర్తించారని, వాటికి ప్రతి అయిదు కిలోమీటర్లకు ఒక ప్యాకేజీగా టెండర్లు పిలవాలని సూచించారు. ఎపిఎండిసి ద్వారా ఈ టెండర్ల పక్రియను వారం రోజుల్లో ప్రారంభించాలని అన్నారు. మొత్తం 300 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రావెల్ ను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలని అన్నారు. మేజర్, మైనర్ మినరల్స్ కు సంబంధించిన మైనింగ్ ను కూడా ఫస్ట్ కం ఫస్ట్ విధానంకు బదులుగా ఆక్షన్ విధానంను అమలు చేయడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించిన నిబంధనలను సమీక్షించాలని మైనింగ్ అధికారులకు సూచించారు.

రెవెన్యూ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలి

రాష్ట్రంలో మైనింగ్ శాఖ ద్వారా రావాల్సిన రెవెన్యూ బకాయిలు అవసరమైతే వన్ టైం సెటిల్ మెంట్ ద్వారా క్లియర్ చేయాలని అన్నారు. పెండింగ్ లో వున్న మైనింగ్ దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు.

అలాగే ఓఎన్జిసి నుంచి మైనింగ్ శాఖకు రావాల్సిన 237 కోట్ల రూపాయలను కూడా వసూలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో మైనింగ్ శాఖ ఇచ్చిన అనుమతులకు మించి అక్రమంగా మైనింగ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్న క్వారీలపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే విజిలెన్స్ విచారణలో అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న సంస్థల అనుమతులను శాశ్వతంగా రద్దు చేయడంతో పాటు అక్రమ మైనింగ్ పై పెనాల్టీలను కూడా విధించాలని అన్నారు. మహాచెక్ పేరుతో గతంలో జరిగిన తనిఖీల్లో అనధికారికంగా జరిగిన మైనింగ్ కు పెనాల్టీలను వసూలు చేయాలని సూచించారు.

ంలో కొత్త మైనింగ్ ప్రాంతాలను గుర్తించేందుకు నిర్దేశిరచిన 'మెరిట్' సంస్థ పనితీరు పట్ల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అపారమైన ఖనిజ నిల్వలు వున్నాయని, వాటిని గుర్తించడం, మైనింగ్ కోసం ఔత్సాహిక సంస్థలకు సమాచారంను అందించడం వంటి కార్యక్రమాల్లో మెరిట్ మరింత చొరవ తీసుకోవాలని సూచించారు. చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా మైనింగ్ లీజుల వసూళ్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే నిర్ణయంలో భాగంగా అమలుకు సంబంధించిన విధివిధానాలపై చర్చించారు. ప్రతి క్వారీ నుంచి లీజులు వసూలు చేసేందుకు రూపొందించిన ఆన్ లైన్ పోర్టల్స్ ను పరిశీలించారు.

# నావెల్ కరోనా వైరస్ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన కేబినెట్ సెక్రటరీ

న్యూఢిల్లీ, ఫి(బ్రవరి 04:నావెల్ కరోనా వైరస్ కు సంబంధించి సన్నాహక చర్యల పై ఒక ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని కేబినెట్ సెక్రటరీ నిర్వహించారు. ఈ సమావేశం లో ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం, విదేశీవ్యవహారాలు, దేశీయ వ్యవహారాలు, పౌరవిమానయాన మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి, ఐటిబిపి, ఎఎఫ్ఎమ్ఎస్ మరియు ఎన్ డిఎమ్ఎ ల ప్రతినిధులు పాల్గొన్నారు. కేబినెట్ సెక్రటరీ ఇంతవరకు ఆరు సమీక్ష సమావేశాలను నిర్వహించారు.

చైనా కు ప్రయాణం ఆపివేసుకోవలసిందిగాను, అక్కడ నుండి తిరిగి వచ్చిన ప్రయాణికుల ను ఏకాంత వాసాని కి పరిమితం చేసే అవకాశం ఉందని ప్రతి ఒక్కరి కి తెలియజేస్తూ ఒక క్రొత్త ట్రావెల్ అడ్వయిజరీ ని జారీ చేయడమైంది. అలాగే,2020వ సంవత్సరం జనవరి 15వ తేదీ నాటి నుండి చైనా కు వెళ్ళిన ప్రతి ఒక్కరి ని మరియు ఇకపై చైనా కు వెళ్ళి వచ్చే వారి ని తాత్కాలికం గా ఏకాంత వాసం లో ఉంచడం జరుగుతుంది. దీనికి తోడు గా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక అడ్వయిజరీ ని జారీ చేసింది. కొన్ని ప్రస్తుత పరిణామాల కారణం గా ఇ-వీసా లతో భారతదేశాని కి ప్రయాణించడాన్ని తక్షణ ప్రాతిపదిక న కొంత కాలం పాటు నిలిపివేస్తున్నట్లు ఆ అడ్వయిజరీ లో తెలిపారు. ఇది చైనా పాస్ పోర్టు లు కలిగి ఉన్నవారికి మరియు పీపుల్స్ రిపబ్లిక్స్ఆఫ్ చైనా లో నివాసం ఉంటున్న ఇతర దేశాల వారి కి వర్తిస్తుంది.

ఇంతవరకు 445 విమాన సర్వీసుల లో విచ్చేసిన 58,658మంది ప్రయాణికుల కు తనిఖీలు నిర్వహించడమైంది. మొత్తం 142 మంది లో రుగ్మతల ను ఐడిఎస్‌పి గమనించినందున, వారి ని కొంత కాలం పాటు ఏకాంత వాసాని కి పరిమితం కావలసింది గా సూచించడమైంది. 130 నమూనాల ను పరీక్షించగా, అందులో128 నమూనాలు నెగెటివ్ గా ఉన్నట్లు తేలింది. కేరళ లో వెల్లడైన రెండు పాజిటివ్ కేసుల ను పర్యవేక్షణలో ఉంచడమైంది. వారి ఆరోగ్య పరిస్థితిచికిత్స ను అందిస్తున్నందువల్ల నిలకడగా ఉంది. వుహాన్ నుండి 330 మంది ప్రయాణికుల తో కూడిన (వీరిలో మాల్దీవ్స్ పౌరులు ఏడుగురు ఉన్నారు) రెండవ బ్యాచ్ భారతదేశాని కి చేరుకొంది. వీరిలో 300 మంది ని ఐటిబిపి చావ్లా క్యాంప్ లో ఉండవలసిందిగా సూచించారు. 30మంది ని మానేసర్ లో ఉంచారు. వీరందరి ఆరోగ్య పరిస్థితి ని నిశితం గా పర్యవేక్షించడం జరుగుతోంది.

# జిఎస్ఐ డైరెక్టర్ జనరల్‌గా శ్రీ ఎం. శ్రీధర్ పదవీ బాధ్యతల స్వీకారం



హైదరాబాద్, ఫి(బ్రవరి 04:భారతీయ భూ వైజ్ఞానిక సర్వేక్షణ (జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా–జిఎస్ఐ) డైరెక్టర్ జనరల్ గా శ్రీ ఎం. శ్రీధర్ పదవీ బాధ్యతల ను స్వీకరించారు.

ఇంతకుముందు, జిఎస్ఐ దక్షిణప్రాంతం అదనపు డైరెక్టర్ జనరల్ గా శ్రీ శ్రీధర్ సేవలు అందించారు. ఆయన 1986వ సంవత్సరం లో జిఎస్ఐ లో చేరారు. హిమాలయాలు మొదలుకొని దక్షిణ భారత ద్వీప కల్పం వరకు భూ వైజ్ఞానిక రంగం లో శ్రీ శ్రీధర్ విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించారు. ఆయన అనేక కార్య సాధనల ను సొంతం చేసుకొన్నభూగర్భ వైజ్ఞానికులు. జిఎస్ఐ కి చెందిన వివిధ జాతీయ ప్రాజెక్టు లను నిర్వహించడం లో ఒక టెక్నోఅడ్మినిస్ట్రేటర్ గా శ్రీ శ్రీధర్ వ్యవహరించారు.

జియాలజికల్ మ్యాపింగ్, ఖనిజాల అన్వేషణ, మరీ ముఖ్యంగా వజ్రాలు, ఇంకా విలువైన ఖనిజాల రంగం లో జాతీయ ప్రఖ్యాతి ని పొందిన శాస్త్రజ్ఞుని గా శ్రీ శ్రీధర్ పేరు తెచ్చుకొన్నారు. వజ్రాల అన్వేషణ రంగం లో ఆయన అసాధారణ తోడ్పాటు కు భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైె నటువంటి నేశనల్ జియో సైన్స్ అవార్డు ను ఆయన కు ప్రదానం చేసింది. శ్రీ శ్రీధర్ రాజమండ్రి లో రాజ మండ్రి ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థి. ఆయన 1980 లో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి భూగర్భ శాస్త్రం లో పట్టభద్రుడయ్యారు.

అనంతరం 1983లో హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి భూగర్భ విజ్ఞాన శాస్త్రం లో మాస్టర్స్ డిగ్రీ ని పొందారు. 1985 లో అదే విద్యా సంస్థ నుండి హైడ్రో జియాలజీ లో ఎంటెక్ డిగ్రీ ని పూర్తి చేశారు. ఖనిజాల అన్వేషణ లో మెరుగైన ఫలితాల సాధన కై క్షేత్ర కార్యకలాపాలను ముమ్మరం చేయడం, ప్రయోగశాలల కు పునరుత్తేజాన్ని ఇవ్వడం తో పాటు పరిశోధన- అభివృద్ధి (ఆర్ ఒ డి) కార్యకలాపాల కు అగ్ర ప్రాధాన్యాన్ని ఇవ్వనున్నట్లు జిఎస్ఐ డైరెక్టర్ జనరల్ శ్రీ ఎం. శ్రీధర్ స్పష్టం చేశారు.

# ప్రజారోగ్యం,సంక్షేమం లక్ష్యంగా కార్యక్రమాలు

## వైద్యరంగానికి కేటాయింపుల పెంపు

## కోఠి ఆస్పత్రిలో నూతన భవనాన్ని ప్రారంభించిన ఈటెల

హైదరాబాద్,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): ప్రజా ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు వెళుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. మునుపెన్నడూ లేనంతగా వైద్యరంగానికి కేటాయింపులు పెరిగాయన్నారు. ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. కోఠి ప్రసూతి వైద్యశాలలో నూతన భవనాన్ని ఈటెల సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యే రాజాసింగ్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో 160 పడకలు ఉన్న ఆస్పత్రిని 250 పడకలకు మార్చుకున్నాం. ప్రజలకు మరింతంగా అందుబాటులో ఉండేందుకు అదనంగా మరో 150పడకలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పుడు మొత్తం 400 పడకలు అందుబాటులోకి వచ్చాయి. ఒకేసారి 9 మందికి డెలవరీ చేసే సౌకర్యం కల్పించుకున్నాం. ఫిట్స్ ఉన్న రోగులకు, ఇతర సమస్యాతక ఫేషట్లకు చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేసుకున్నామని వెల్లడించారు. ఇక్కడ అధునాతన పరికరాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఉస్మానియా ఆస్పత్రిలో ట్రామా సెంటర్ భవనానికి శంకుస్థాపన చేసుకున్నాం. త్వరలోనే ఈ భవనం కూడా పూర్తి చేసుకుని ప్రారంభోత్సవం చేసుకుందామని తెలిపారు. వైద్యపరంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని, వసతులు పెంచుతూ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నామని మంత్రి అన్నారు.

# రెవెన్యూ డివిజన్లుగా జోగిపేట, వేములవాడ

## –ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): సంగారెడ్డి జిల్లా జోగిపేట, సిరిసిల్ల రాజన్న జిల్లా వేములవాడను రెవెన్యూ డివిజన్‌లుగా ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 30 రోజుల్లో ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనలు రెవెన్యూ అధికారులకు అందించవచ్చు. 30 రోజుల అనంతరం వేములవాడ, జోగిపేటలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనుంది.

# అంపర్ బూటు తాకి..అసభ్య విమర్శలు

## –జుకోవిచ్‌కు భారీ జరిమానా విధించే అవకాశం

మెల్‌బోర్న్,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్ సందర్భంగా ఛైర్ అంపైర్ పాదాన్ని తాకడంపై ఛాంపియన్ నొవాక్ జొకోవిచ్ స్పందించాడు. అంపైర్ పాదాన్ని తాకినందుకు తానెంతో చింతిస్తున్నట్లు తెలిపాడు. అంపైర్ షూను టచ్ చేసే సమయంలో తాను ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని వివరణ ఇచ్చుకున్నాడు. నిజంగా స్నేహపూర్వకంగానే తాకానని చెప్పుకొచ్చాడు.

వరుసగా రెండు సార్లు జొకోవిచ్ నిర్ణీత సమయంలో సర్వీస్ చేయకపోవడంతో అంపైర్ డామియన్ డుముసోయిస్ సెర్బియా స్టార్ జొకోను హెచ్చరించాడు. రెండో సెట్‌లో 4–4తో సమంగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఐతే సహనం కోల్పోయిన నొవాక్ వెంటనే సెట్ ముగిశాక తన సీటులో కూర్చొనేందుకు వెళ్తుతూ అంపైర్ ఛైర్ వద్దకు వచ్చి డామియన్ బూటుపై చేతితో కొడుతూ వెటకారంగా చూస్తూ.. ఈ మ్యాచ్‌లో నువ్వెంతో ఫేమస్ అయ్యేలా చేసుకున్నావు. గ్రేట్ జాబ్. మరీ ముఖ్యంగా రెండోది. వెల్‌డన్ మ్యాన్ అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. జొకో వ్యాఖ్యలపై అంపైర్ వెంటనే స్పందించలేదు. అఫిషియల్ గ్రాండ్ రూల్ బుక్ నియమావళి ప్రకారం నొవాక్‌కు భారీ జరిమానా విధించనున్నారు. నిబంధనల ప్రకారం అతనికి సుమారు 14లక్షల వరకు జరిమానా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తనకు తిరుగులేదని నిరూపిస్తూ.. సెర్బియా వీరుడు నొవాక్ జొకోవిచ్ ఎనిమిదోసారి ట్రోఫీ చేజిక్కించుకున్నాడు.

# ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

## –శిక్షణ పూర్తిచేసుకున్న ఉద్యోగులకు మంత్రి సూచన

హైదరాబాద్,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): శిక్షణ పూర్తిచేసుకున్న ఎక్సైజ్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం ఎక్సైజ్ అకాడమీలో నూతనంగా నియమితులైన 273 మంది ఎక్సైజ్ ట్రయినీ సబ్ ఇన్‌స్పెక్టర్‌ల శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించాక ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. వివిధ ప్రభుత్వశాఖల అభివృద్ధికి నిధులు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సేవ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ బంగారు తెలంగాణ సాధనలో ఎక్సైజ్ అధికారుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఎక్సైజ్ అధికారుల శిక్షణను చాలా పకడ్బందీగా తయారు చేసినట్టు తెలిపారు. ట్రైనీలను అన్ని అంశాలలో నిష్ణాతులుగా తీర్చిదిద్దే విధంగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఎక్సైజ్ అకాడమీకి అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చామని తెలిపారు. అందుబాటులో అన్ని వనరులను ఉపయోగించుకుని శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలని అన్నారు. ఈసందర్భంగా ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సీఎస్ సోమేశ్‌కుమార్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

# దిశ ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ కమిటీ

## –ముగిసిన తొలిరోజు విచారణ

హైదరాబాద్,ఫి(బ్రవరి4(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు నియమించిన జ్యుడీషియల్ కమిటీ హైదరాబాద్‌కు చేరుకుని తొలిరోజు విచారణను పూర్తి చేసింది. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన పూర్తి వివరాల గురించి ఆరా తీసే క్రమంలో... నిందితుల పోస్టుమార్టం రిపోర్టు, రీ పోస్టుమార్టం నివేదికలను కమిటీ పరిశీలించనుంది. అదే విధంగా ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) నుంచి వివరాలు సేకరించనుంది.

హైకోర్టు సీ బ్లాక్ కేంద్రంగా దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిటీ విచారణ చేపట్టిన విచారణ తొలిరోజు ముగిసింది. అడిషనల్ డీజీ జితేందర్, సిట్ చీఫ్ మహేష్ భగవత్ హైకోర్టుకు చేరుకుని, ఎన్‌కౌంటర్‌పై స్టేటస్ రిపోర్టును కమిషన్‌కు అందచేశారు.నిందితుల పోస్టుమార్టం రీ పోస్టుమార్టం రిపోర్ట్‌ను కూడా పరిశీలించారు. మూడు రోజుల పాటు దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై కమిషన్ వివరాలు సేకరించ నుంది. నిందితుల కుటుంబ సభ్యులతో పాటు దిశ ఫ్యామిలీ మెంబెర్స్ స్టేట్ మెంట్‌ను కూడా కమిటీ రికార్డ్ చేయనుంది. అలాగే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను కమిషన్ విచారణ చేయనుంది. ఇక హైకోర్టు వేదికగా కమిటీ దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాలతో ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. మొదటి రోజు ముగిసిన సుప్రింకోర్టు కమిషన్ విచారణ అనంరరం బస నిమిత్తం నగరంలో తాజ్ హోటల్ కు చేరుకున్నారు. కాగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలో గతేడాది నవంబరు 27న వెటర్నరీ వైద్యురాలిపై మహ్మద్ ఆరిఫ్, జొల్లు నవీన్, జొల్లు శివ, చెన్నకేశవులు అనే నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడి.. అనంతరం ఆమెపై పెట్రోలు పోసి తగులబెట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా వారు పారిపోవడానికి ప్రయత్నం చేయడంతో ఎన్‌కౌంటర్ చేసినట్లు వెల్లడించారు. అయితే ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఈ ఘటనపై విచారణ జరిపించాలని ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# నేడు లఖ్‌నవూ లో జరిగే'డిఫ్‌ఎక్స్‌పో 2020' ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2020వ సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీ న లఖ్‌నవూ లో జరిగే 'డిఫ్ ఎక్స్‌పో 2020' ప్రారంభ కార్యక్రమాని కి అధ్యక్షత వహించనున్నారు.

ఇది ప్రతి రెండు సంవత్సరాల కు ఒకసారి జరిగే భారీ రక్షణ రంగ సంబంధిత ప్రదర్శన పరంపర లో 11వ ప్రదర్శన. భారతదేశం లో ఇంతవరకు నిర్వహించినటువంటి ప్రదర్శనల లో అతి పెద్దదైన ఈ ప్రదర్శన లో వాటి వాటి ఉత్పత్తుల ను ప్రదర్శించాలని 1000కి పైగా జాతీయ కంపెనీలు మరియు అంతర్జాతీయ కంపెనీ లు పోటాపోటీ పడుతున్నాయి.

'రక్షణ రంగ తయారీ కేంద్రం గా ఎదుగుతున్న భారతదేశం' అనేది ఈ ఎక్స్ పో ఇతివృత్తం గా ఉంది. రక్షణ రంగం లోని అగ్రగామి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒక ఛత్రఛాయ కిందకు తెచ్చి, ప్రభుత్వాని కి, ప్రైవేటు ఉత్పత్తి సంస్థల కు మరియు స్టార్ట్-అప్ లకు అనేక అవకాశాల ను అందించాలనేది ఈ ప్రదర్శన యొక్క ధ్యేయం గా ఉంది. ఈ కార్యక్రమం లో భారతదేశ రక్షణ, భద్రత మరియు ఏరోస్పేస్ ప్రయోజనాల తాలూకు సంపూర్ణమైన ముఖచిత్రం కళ్ల కు కట్టనుంది.

సరిక్రొత్త సాంకేతికత లను మేళవించే భావి రణరంగం అనే భావన తో మమేకమయ్యే 'రక్షణ రంగం యొక్క డిజిటల్ పరివర్తన' అనేది ఈ ప్రదర్శన తాలూకు ఉప ఇతివృత్తం గా ఉంది. ప్రారంభ కార్యక్రమం లో పాలుపంచుకొన్న అనంతరం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇండియా పెవిలియన్ ను మరియు ఉత్తర్ ప్రదేశ్ పెవిలియన్ ను సందర్శిస్తారు.

'ఇండియా పెవిలియన్' చిన్న మరియు మధ్యతరహా సంస్థలు (ఎస్ఎంఇ స్)/ సూక్ష్మ, లఘు మరియు మధ్యతరహా సంస్థ లు (ఎంఎస్ఎంఇ స్), ఇనవేశన్ ఇకో-సిస్టమ్ లు సహా ప్రభుత్వ రంగాని కి మరియు ప్రైవేటు రంగాని కి మధ్య బలమైన భాగస్వామ్యాన్ని కళ్ళకు కట్టనుంది. ఉత్తర్ ప్రదేశ్ పెవిలియన్ ఆ రాష్ట్రం పారిశ్రామిక శక్తి ని ప్రదర్శించడం తో పాటు రాష్ట్రం లో ఇప్పటికే గుర్తించి న డిఫెన్స్ కారిడోర్ లో ఇన్వెస్టర్ లకు గల భారీ అవకాశాల ను కూడా చాటి చెప్పనుంది. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని చాటే పలు సాంస్కృతిక కార్యక్రమాల ను కూడా ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఈ సందర్భం గా ఏర్పాటు చేయనుంది. ఈ ప్రదర్శన సందర్శకుల కు విశిష్ట అనుభూతి ని పంచడం కోసం కార్యక్రమ స్థలం లో టెంట్ సిటీ ని ఏర్పాటు చేస్తున్నారు.

ప్రధాన మంత్రి ఈ రెండు పెవిలియన్ లను సందర్శించిన అనంతరం, త్రివిధ దళాల సమగ్రమైన ప్రత్యక్ష విన్యాసాల కు కూడా అధ్యక్షత వహించనున్నారు.

ఈ 'డిఫ్ ఎక్స్ పో 2020' లో 70 దేశాల కు పైగా పాలుపంచుకొంటాయని భావిస్తున్నారు. ఇది అంతర్జాతీయ రక్షణ రంగ ప్రదర్శనల లో అతి పెద్ద ప్రదర్శన ల సరసన స్థానాన్ని దక్కించుకోనుంది.

ఈ ఎక్స్ పో లో గణనీయ సంఖ్య లో అవగాహన పూర్వక ఒప్పందం పత్రాలు (ఎంఒయు స్)పై సంతకాలు అవుతాయని ఆశిస్తున్నారు.

# రెవెన్యూ అధికారుల పొరపాటు

## వేయిమంది రైతులకు శాపం

## ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో నిర్లక్ష్యం

ఆదిలాబాద్,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): రెవెన్యూ అధికారుల నిర్వాకం రైతులకు శాపంగా మారింది. నిర్లక్ష్యంగా వ్యవహరించి దాదాపుగా వెయ్యి రెవెన్యూ ఖాతాలు ఆన్‌లైన్ నుంచి మాయం చేయడమే కాకుండా తిరిగి నమోదు కోసం రేపుమాపంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో అన్నదాతలకు రైతుబంధు పెట్టుబడి సాయం చేజారే పరిస్థితి నెలకొంది. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ అవగాహన లోపంతో చేసిన తప్పిదంతో 2 వేల ఖాతాలు ఆన్‌లైన్ నుంచి మాయమయ్యాయి. ఈ విషయంలో విమర్శలు రావడంతో పక్షం రోజుల్లో సవరిస్తామని బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటించారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఖాతాలు మనుగడలోకి రాలేదు. ఆన్‌లైన్‌లో ఖాతాలు గల్లంతైన వారికి రైతుబంధు సాయం చేజారే పరిస్థితి ఉంది. రబీ రైతుబంధు నిధుల విడుదల కోసం వ్యవసాయశాఖ రైతుల వివరాలను రెవెన్యూ శాఖ నుంచి తీసుకొంది. అందుబాటులో ఉన్న డాటాను మాత్రమే వారు అప్‌లోడ్ చేశారు. వెబ్‌సైట్‌లో ఉన్న రైతులకే దశల వారీగా పెట్టుబడి సాయాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. నెన్నెల మండలానికి చెందిన దాదాపు వెయ్యి మంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేక పోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారందరికి రైతుబంధు దూరమవుతోంది. ఒక రైతుకు 5 ఎకరాల భూమి ఉంటే అతడికి రూ. 25 వేల నష్టం జరుగుతుంది. ఇలా ఒక్కో రైతు వేల రూపాయలను చేజార్చుకునే పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయంపై ఆశలు పెంచుకున్న రైతులు ఈ పరిణామంతో ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు.

ఇదిలా ఉండగా యాసంగి రైతుబంధు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేసి వ్యవసాయ శాఖ నుంచి రైతుల వివరాలు తీసుకొంది. రైతుల ఖాతాల్లోకి నగదు బదిలీ ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో వివరాలు మిస్సైన వారందరు రైతుబంధుకు దూరం కానున్నారు. ఇప్పటికే వివరాలు కమిషనరేట్‌కు చేరడంతో మార్పులు చేర్పులు చేసిన వాటిని మళ్లీ ఖరీఫ్ సీజన్ వరకు అప్‌లోడ్ చేసే వీలుండదు. దీంతో ఈ యాసంగిలో ఖాతాలు గల్లంతైన రైతులకు రైతుబంధు వచ్చే అవకాశం లేకుండాపోయింది. కలెక్టర్ ప్రత్యేక చొరవచూపి తమ ఖాతాలు మనుగడలోకి వచ్చేలా చూడాలని, రైతుబంధు సాయం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు. నెన్నెల మండలంలోని దాదాపు వెయ్యి మంది రైతుల రెవెన్యూ ఖాతాల వివరాలు రెండు నెలలుగా ఆన్‌లైన్‌లో కానరావడం లేదు. భూప్రక్షాళన సమయంలో ఒక రైతుకు వేర్వేరు సర్వే నంబర్లలో భూమి ఉంటే ఒకే ఖాతా నెంబరు ఇచ్చి అన్నింటిని ఒకే చోట చేర్చే పనులు చేపట్టారు. వేర్వేరు గ్రామాల్లో భూములు ఉంటే మరో ఖాతా కేటాయించారు. ఈ ప్రక్రియ మొత్తం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగింది. పనుల కోసం ఉన్నతాధికారులు ఆన్‌లైన్‌లోనే వివరాలను పరిశీలిస్తూ మండల అధికారులను వేగిరపరిచారు. వివిధ ఎన్నికల కారణంగా అతి తక్కువ సమయంలో ముగ్గురు తహసీల్దార్లు మారారు. దీంతో ఆన్‌లైన్ ప్రక్రియ మందకొడిగా సాగింది. పంచాయతీ ఎన్నికల అనంతరం పనులను వేగిర పర్చడంలో భాగంగా డిజిటల్ సంతకాల్లో వెనుకబడిన మండలాలపై కలెక్టర్ దృష్టి సారించారు. ఈ క్రమంలో చిన్న పాటి తప్పులు ఉన్నా.. సర్వే నంబర్‌ను మాత్రమే పక్కన పెట్టాల్సి ఉండగా సదరు రైతుకు చెందిన ఖాతా మొత్తాన్ని నాన్ డీఎస్‌లో పెట్టేశారు. దీంతో ఆ రైతుకు ఉన్న భూములన్నీ ఆన్‌లైన్ నుంచి కానరాకుండా పోయాయి. ఈ విషయాన్ని పత్రికలు వెలుగులోకి తేవడంతో బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ నెన్నెలకు వచ్చి విచారణ చేపట్టారు. పక్షం రోజుల్లో అన్ని సరి చేస్తామని ప్రకటించారు. రైతుల నుంచి పాత రికార్డులు, పాత పట్టాదారు పాసుపుస్తకం, డిజిటల్ పాసుపుస్తకం జత చేసిన దరఖాస్తులు తీసుకున్నారు. ఇప్పటికీ రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో కానరావడం లేదని రైతులు వాపోతున్నారు.

# గద్వాల మున్సిపాలిటీకి కోటి టోపీ?

## తై బజారు టెండర్లలో అవినీతి

## కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోని అధికారులు

## కొత్త పాలకవర్గం నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి

గద్వాల,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): గద్వాల మునిసిపాలిటీలో తై బజారు టెండర్లలో అవినీతి రాజ్య మేలుతోంది. నిబంధనలకు వ్యతి రేకంగా టెండర్లు ఖరారు చేయడం నుంచి లెక్కా పత్రం లేకుండా సంబంధంలేని వ్యక్తులతో వసూలు చేయిస్తున్న సొమ్ములో భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాలకవర్గాల లోపాయికారి తనం, మునిసిపల్ యంత్రాంగం చేతి వాటం వెరసి గద్వాల మునిసిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. తై బజారు నిబంధనల మేరకు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చివరి వాయిదాలు చెల్లించుకుండా మునిసిపాలిటీకి ఎగనామం పెడుతున్నారు. ఇలా మునిసిపాలిటీలో పది మందిపైగా తై బజారుకు సంబంధించిన సొమ్ము బకాయి పడ్డారు. మొత్తంగా రూ.కోటికి పైగానే బకాయిలు ఉంటాయని అంచనా. ముందుస్తు చెక్కులు ఇచ్చిన వారిపై మునిసిపాలిటీ యం త్రాంగం చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా వచ్చిన పాలకవర్గమైనా ఇలాంటి అవినీతి అక్రమాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు. రోజుకు రూ. 20 వేలకుపైగా వసూళ్లు చేస్తూ మునిసిపాలిటీకి నిబంధనలకు వ్యతిరేకంగా రోజుకు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు జమ కడుతున్నారు. మిగిలిన రూ.10 వేలను వాటాలుగా పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మునిసిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరు తై బజారు వేలం. ప్రతి ఏటా మార్చి1 నుంచి ఫిబ్ర వరి 28 వరకు తై బజారు కోసం టెండర్లు నిర్వ హిస్తారు.

గత పాలక వర్గం సమయంలో తై బజారుకు నిర్వహించిన టెండర్లలో వేలంలో రూ.42 లక్షలకు పాట పాడారు. అయితే కాం ట్రాక్టర్లు సిండికేట్‌గా మారారని పాలక వర్గం రూ.42 లక్షల టెండర్‌ను రద్దు చేసింది. అనంత రం గుట్టు చప్పుడు కాకుండా ఓ వ్యక్తికి రూ.33 లక్షలకే టెండర్ ఇచ్చినట్టు తెలిసింది. ఈ టెండరు తీసుకున్న వ్యక్తి ఎవరో తెలియ దు కాని ఎక్కడా లేని కొత్త పద్ధతికి పాలకవర్గం, మునిసిపాలిటీ యంత్రాంగం శ్రీకారం చుట్టాయి. ప్రతి రోజూ తై బజారులో వచ్చిన సొమ్ములో కొంత మేరకు మునిసిపాలిటీకి జమ కట్టాలని బినామీ వ్యక్తికి తై బజారును అంటగట్టారు. బినామీగా టెండరు తీసు కున్న వ్యక్తి రోజుకు రూ. 20 వేలు వసూలు చేస్తూ మునిసిపాలిటీకి రూ.9 వేల నుంచి రూ.10 వేల లోపు కడుతు న్నారని తెలియ వచ్చింది. అదనంగా వచ్చిన సొమ్ములో బినామీతోపాటు మిగిలిన కొందరు నిత్యం పంపకాలు చేసుకుంటున్నారని సమాచారం. ఇంత జరుగుతున్నా మునిసిపల్ అధికార యంత్రాంగం మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. టెండరు దక్కించుకున్న వ్యక్తి ముం దస్తుగా మునిసిపాలిటీకి 33 శాతం డబ్బును టెండరు ఖరారుపై చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ముందుస్తు సొమ్మును చెల్లించకుండా బినామీ వ్యక్తికి ఇచ్చిన తై బజారును నడిపిస్తున్నారు. పాలకవర్గం రద్దు అనంతరం తై బజారు సొమ్ము ఎంత కడుతున్నాడు.. అసలు కడుతున్నాడా లేదా అనే సమాచారం లేకుండా పోయింది. కొత్త పాలక వర్గం తై బజారు వేలాన్ని సక్ర మమైన రీతిలో కొనసాగిస్తుందా.. లేక పాత పాలక వర్గం బాటలోనే పయనిస్తుందా అని ఎదురుచూస్తున్నారు. గద్వాల మునిసిపాలిటీ పరిధిలో హోల్‌సెల్ కూరగాయల మార్కెట్‌లో నిత్యం రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షల కూరగాయల వ్యాపారం జరుగుతుంది.

తీసుక వచ్చిన కూరగాయలపై తై బజారుకు పన్నులు చెల్లిస్తారు. ఈ పేరుతో హోల్‌సెల్ కూరగాయల వ్యాపారులు రైతుల నుంచి రూపాయికి రెండు రూపాయలు వసూలు చేయడంతో రైతులు తిరుగుబాటు చేశారు. ఈ విషయంలో హోల్ సేల్ కూరగాయల వ్యాపారులపై కేసులు నమోదయ్యాయి. ప్రతి సంవత్సరం తై బజారు కాంట్రాక్టర్‌కు హోల్‌సేల్ మార్కెట్ నుంచి రూ. 10 లక్షలకు పైగా పన్నులు వచ్చేవి. రైతుల తిరుగుబాటుతో హోల్‌సేల్ వ్యాపారులు రైతుల నుంచి తై బజారు పన్నులను వసూళ్లు చేయడం మానేశారు. ఈ సంఘటనను బూచిగా చూపి రూ. 44 లక్షలు పలికే టెండర్లను రూ. 33 లక్షలకు కుదించారు. 33 శాతం సొమ్ము ముందు చెల్లించకుండా బినామీ తై బజారు వేలం నడుపుతున్న వ్యక్తి హోల్ సేల్ వ్యాపారులను నుంచి అంతర్గతంగా వసూళ్లు చేస్తున్న సొమ్మును లెక్కల్లో చూపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.






# చైనీయులకు జారీచేసిన వీసాలు రద్దు

## భారత్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 (ఆర్ఎన్ఎ): ప్రాణాంతక కరోనా వైరస్ రోజురోజుకీ తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. చైనాను సందర్శించిన విదేశీయులు, చైనా దేశస్థులకు జనవరి 15 తర్వాత భారత్ జారీ చేసిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు చైనాలో భారత రాయబార కార్యాలయం ట్విటర్ వేదికగా వెల్లడించింది.

చైనా పౌరులు, గత రెండు వారాల్లో చైనాను సందర్శించిన ఇతర దేశాల పర్యాటకులు భారత్‌కు వెళ్లేందుకు ప్రస్తుతం తమ వద్ద ఉన్న వీసాలను ఉపయోగించుకోవచ్చా అని పర్యాటకుల నుంచి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. అయితే ఆ వీసాలు ఇకపై పనిచేయవు. ప్రస్తుతమున్న వీసాలను భారత ప్రభుత్వం రద్దు చేసింది. వీరంతా భారత వీసాల కోసం కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే. సాధారణ లేదా ఇ-వీసా ద్వారా జనవరి 15 తర్వాత చైనా నుంచి భారత్‌కు వెళ్లిన చైనా దేశీయులు లేదా ఇతర దేశాల పర్యాటకులు వెంటనే కేంద్ర ఆరోగ్యశాఖ హాట్‌లైన్ నంబర్లను సంప్రదించండి' అని భారత రాయబార కార్యాలయం వరుస ట్వీట్లలో పేర్కొంది.

ఇప్పటికే చైనా పర్యాటకులకు, ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే ఇతర దేశాల పర్యాటకులకు ఇ-వీసా సదుపాయాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. తాజాగా ఇతర వీసాలను కూడా రద్దు చేసింది. చైనాలో మొదలైన కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా 25 దేశాలకు పైగా పాకింది. భారత్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. దీంతో కేంద్రం అప్రమత్తమైంది. మరోవైపు చైనా నుంచి స్వదేశానికి తీసుకొచ్చిన భారతీయులను దిల్లీ సమీపంలోని వైద్య శిబిరంలో ఉంచారు.

# అసదుద్దీన్ కూడా హనుమాన్ చాలీసా చదువుతారు- యూపీ సీఎం ఆదిత్యనాథ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 (ఆర్ఎన్ఎ): ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ కూడా ఏదో ఒక రోజు హనుమాన్ చాలీసా చదువుతారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా.. మంగళవారం కిరారిలో జరిగిన ప్రచార సభలో యోగి పాల్గొన్నారు. అక్కడ సీఎం యోగి మాట్లాడుతూ.. ఇప్పుడిప్పుడు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హనుమాన్ చాలీసా చదవడం మొదలుపెట్టారని, ఇక ముందు ఏం జరుగుతుందో కూడా మీకే తెలుస్తుందని, ఎంఐఎం నేత ఓవైసీ కూడా ఏదో ఒక రోజు హనుమాన్ చాలీసా చదువుతూ కనిపిస్తారని అన్నారు. ఢిల్లీలోని షహీన్ బాగ్‌లో జరుగుతున్న సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలను ఆదిత్యనాథ్ ఖండించారు. సీఏఏ నిరసనకారులకు ఇలాంటి నేతలు బిర్యానీలు అందిస్తున్నారని, మరో వైపు చాలీసా వల్లిస్తున్నారని యోగి ఆరోపించారు. సీఎం యోగిపై ప్రచార నిషేధం విధించాలని ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.

**BEFORE THE MOTOR VEHICLE ACCIDENTS CLAIMS TRIBUNAL CUM I ADDL CHIEF JUDGE AT: SECUNDERABAD**
**O.P.NO. 22 of 2017**

Between
Golla Laxmi & others ...Petitioners
And
N.Satyanarayana & another ...Respondents

To,
1.S/o N.Satyanarayana,
Occ- Owner of crime vehicle
R/o 10-4-C/990,
Addagutta,
East Maredpally,
Secundrabad
2.Venkatraman.K
S/o K.V.Krishnamurthy ,
Age-44 years, Occ- Driver
R/o .68/7,III,
Balaji Apartment,
Gandhinagar,Ch 20,SSDS,
Chennai-600020

Take notice that the petitioner has filed a petition against the respondents U/S 166 of M.V.Act . You are hereby requi zred to appear before this Hon'ble Court on **7th February 2020** at **10:30 AM,** in person or through an Advocate duly instructed to answer all material questions relating to the above proceedings, in default the issue will be heard and determined in your absence.

By order of the Court.
**- SUDARSHAN REDDY**
**SUBBAGARI**
**J.RAMESH**
Advocates
Counsel for petitioner
Plot# 58 Saptagiri colony,
Neredment X Road,
Secundrabad-94

# సిద్ధమవుతున్న న్యూ ఎడ్యుకేషన్ పాలసీ

## ఆర్థిక మంత్రి ప్రకటనతో మారనున్న చదువులు

## వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు

## స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించే కోర్సులు

## పాఠశాలస్థాయి నుంచే వృత్తి విద్య కోర్సులకు ప్రాధాన్యం

హైదరాబాద్,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): బట్టీ చదువులకు స్వస్తి చెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే నూతన విద్యావిధానం ప్రవేశ పెడతామని బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. విద్యార్థుల్లో బట్టీ చదువుల కారణంగా సామాజిక దృక్పథం, వృత్తి విద్యల్లో వెనకబడి ఉన్నారని కస్తూరి రంగన్ కమిటీ గుర్తించింది. విద్యార్థులకు వృత్తి విద్య తప్పనిసరి అవసరమని 2019మేలో ఆ కమిటీ డ్రాఫ్ట్ పాలసీని కేంద్ర మానవ వనరుల శాఖకు అందజేసింది. దేశవ్యాప్తంగా నిపుణులు, మేధావుల నుంచి తీసుకున్న అభిప్రాయాలను సేకరించి కేంద్రం న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో వృత్తి విద్యకు సంబంధించిన కీలక సిఫారసును చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులను ప్రవేశపెట్టి వచ్చే ఐదేళ్లలో 50శాతం విద్యార్థులకు వృత్తి విద్య అభ్యసించాలన్నదే లక్ష్యంగా చేపట్టనుంది. రోజు రోజుకు పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని తగ్గించడానికి విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించేందుకు పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్య కోర్సులను ప్రవేశపెట్టనుంది. ఉన్నత విద్య సంస్థలు సాఫ్ట్, స్కిల్, ఇతర సర్టిఫికెట్ల కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఎన్ఈపీ సిఫారసుకు చేసింది. ఏయే రంగంలో విద్యార్థులకు అవగాహన, ఇష్టం ఉందో తెలుసుకొని ఆ వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుంది. స్థానికంగా ఉపాధి అవకాశాలు ఏయే రంగాల్లో ఉన్నాయో చూసి అలాంటి కోర్సులను ప్రవేశపెట్టాలని స్పష్టంచేసింది. టెక్నికల్ ఎడ్యుకేషన్, వోకేషనల్ ఎడ్యుకేషన్, సమగ్ర విద్యా విధానంలో భాగంగా చేయాల్సిందేనని తెలిపింది. ఇందుకోసం విద్య మంత్రిత్వ శాఖ, పారిశ్రామిక భాగస్వామ్యంతో నేషనల్ కమిటీ ఫర్‌ది ఇంటిగ్రేషన్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బడ్జెట్‌ను కేటాయించేందుకు కేంద్రం సన్నాహాలు చేపట్టింది. ఎన్‌సీఐవీఈ సహకారంతో నూతన కోర్సులను ప్రారంభించనున్నారు. విద్యార్థుల్లో మేధస్సు, వృత్తి విద్య శిక్షణ ఇచ్చేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేక ప్రణాళికను ప్రవేశపెట్టనుంది. విద్యార్థుల్లో సామాజిక దృక్పథం, వృత్తి విద్య కోర్సులపై అవగాహన కోసం ఇక నుంచి పాఠశాల స్థాయినుంచే ప్రారంభించనున్నారు. 2025 నాటికి విద్యార్థుల్లో 50శాతం వృత్తివిద్య అభ్యసించాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం ఇంటర్మీడియట్, డిగ్రీ లాంటి ఉన్నత స్థాయిలోనే వృత్తి విద్య కోర్సులు ఉండగా ఒకేసారి వృత్తి విద్యకు మళ్లించడం విద్యార్థులకు కష్టంగా మారింది. ఇతర దేశాలతో చూసుకుంటే భారతదేశంలో విద్యార్థుల్లో 5శాతం మాత్రమే వృత్తి విద్య కోర్సుల్లో ఉన్నారని నివేదికలు తెలుపుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థులను పాఠశాల వైపు మళ్లించేందుకు 8వ తరగతి నుంచి వృత్తి విద్యపై ఆసక్తి కనబర్చే వారు. అంతగా ఫలితాలు సాధించకపోవడంతో ఉన్నత విద్య తర్వాత ఈ కోర్సులను ప్రవేశపెట్టారు. 2017 జూన్ లో డాక్టర్ కస్తూరి రంగన్ నేతృత్వంలో విద్యార్థుల మనోభావాల పై కమిటీని నియమించారు. 2019 మే వరకు కమిటీ విద్యార్థులపై సర్వే నిర్వహించింది. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ 11,12వ తరగతుల విద్యార్థులకు ఒకేషనల్ సబ్జెక్టులతో కూడిన వృత్తి విద్య కోర్సులు మాత్రమే అమలులో ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో వృత్తి విద్య కోర్సులను దశల వారీగా వివిధ స్థాయిల్లో అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రాథమిక పాఠశాల స్థాయినుంచే నాణ్యమైన వృత్తి విద్యను అందిస్తూ ఉన్నత విద్య వరకు తీసుకెళ్లాలని యోచిస్తోంది. ప్రతి విద్యార్థి ఒక వృత్తి విద్య కోర్సును చదివేలా చర్యలు చేపట్టనుంది.

# కంది కొనుగోళ్లలో జాప్యం

## ధరలు తగ్గే ప్రమాదం ఉందని రైతుల ఆందోళన

## కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేయాలని వినతి

సూర్యాపేట,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ) జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్లకు కందులు రావడం ప్రారంభమైంది. కందులు మార్కెట్లకు వస్తున్న తరుణంలోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యమైతే వ్యాపారులు ఇంకా ధర తగ్గించే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటను విక్రయించే రైతులు ఆధార్ కార్డు, పట్టదారు పాసు పుస్తకం ఫొటోస్టాట్, బ్యాంకు ఖాతా పుస్తకంతో పాటు వీఆర్‌వో నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తెలుపుతున్నారు. కందుల కొనుగోలు కేంద్రంలో పంట విక్రయించేందుకు వచ్చే రైతులు తేమ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ పలు సూచనలు చేసింది. కందులలో తేమశాతం 12 కంటే తక్కువగా ఉంటేనే కేంద్రంలో కొనుగోలు చేస్తారు. తేమశాతం 12 కంటె తక్కువగా ఉండేలా రైతులు ఇంటి వద్దే ఆరబెట్టుకొని తీసుకురావాలి. కందుల కొనుగోలు కేంద్రాలకు అవసరమైన ఏర్పాట్లపై ఉమ్మడి మార్క్‌ఫెడ్, జిల్లా సహకార అధికారి, వ్యవసాయాధికారి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులతో సూర్యాపేటలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరలో జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. కాగా, నేటికీ కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో పురోగతి కనిపించ లేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నమని మార్క్‌ఫెడ్ అధికారులు తెలియజేస్తుండగా, కందులు కొనుగోలు చేసే బాధ్యత తమకు లేదని జిల్లా సహకార అధికారులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే వ్యవసాయ శాఖ నుంచి ఒక ఏవో, మరో ఏఈవోను పంపేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. అయితే శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ఖరీఫ్‌లో కంది సాధారణ సాగు విస్తీర్ణం పెరగడంతో ఆ మేరకు పంట దిగుబడులు కూడ ఆపెరిగాయి. జిల్లాలో గత నెల 2వ తేదీ నుంచి మార్కెట్లకు కందులు రావడం ప్రారంభమైంది. మార్కెట్‌లో క్వింటాకు ధర రూ.5 వేలు కూడా రావడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 10 కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంతోపాటు కొండమల్లేపల్లి, యాదాద్రి జిల్లాలో భువనగిరి, ఆలేరు, చౌటుప్పల్, మోత్కూర్, మోటకొండూరు, రాజాపేట వ్యవసాయ మార్కెట్లలో, సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తిరుమలగిరి, వ్యవసాయ మార్కెట్లలో త్వరలో కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు.

# కోఆప్షన్ సభ్యుల కోసం పైరవీలు

## అధికార పార్టీలో పెరిగిన ఆశావహులు

మంచిర్యాల,ఫిబ్రవరి 4(ఆర్ఎన్ఎ):కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం గతంలో కంటే కో ఆప్షన్ సభ్యులు పెరిగే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి త్వరలోనే కో ఆప్షన్ సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్ సైతం రానుంది. మున్సిపాలిటీల పరిధిలో కోఆప్షన్ పదవుల కోసం ఆశావాహులు ఎంతో మంది ఉండడంతో ఎవరికి వస్తాయోననే చర్చలు జరుగుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక అనంతరం 45 రోజుల్లోనే కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ వస్తేనే ఈ పదవులపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గం ప్రమాణ స్వీకారం ముగిసిన విషయం తెలిసిందే. తొలి మున్సిపల్ సమా వేశం వరకే కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ రానుంది. ఈ నెలాఖరులో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కో ఆప్షన్ పదవుల కోసం ఇప్పటి నుంచే ఆశావాహులు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షణలు చేస్తుండడం మరో వైపు రిజర్వేషన్ కలిసి రాని, టికెట్ దక్కని వారు సైతం ప్రయత్నిస్తుండడంతో ఈ పదవులు ఎవరిని వరిస్తాయో అని చూస్తున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 6 మున్సిపాలిటీలను టీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకొంది. చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎంపిక, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం పూర్తయింది. ఈ మున్సిపాలిటీల్లో అధికార టీఆర్ఎస్ పార్టీ తరపున కోఆప్షన్ పదవులను పొందేందుకు ఆశావాహులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఆయా మున్సిపాలిటీల్లో పలువురు కో ఆప్షన్ పదవులపై ఆశలు పెట్టుకుని ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లం పల్లి, నస్పూర్, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీలను టిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడంతో అధికార పార్టీ తరుపున కో ఆప్షన్ పదవులను పొందేందుకు ఆశావాహులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ పదవుల కోసం ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేల చుట్టూ ఆశావాహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో టికెట్‌లు ఆశించిన వారిని బుజ్జగించే క్రమంలో పలువురు నేతలు కో ఆప్షన్ పదవుల ఆశ చూపెట్టి బరిలో ఉండకుండా చూశా రు. అంతేకాకుండా సీనియర్ నాయకులతోపాటు పార్టీలో కీలకంగా పనిచేసిన వారు, రిజర్వేషన్‌లు కలిసి రాని వారు సైతం ఈ కో ఆప్షన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. వీరంతా ముఖ్య నాయకు లు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవల ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు సైతం వారి అనుచరులకే కో ఆప్షన్ పదవులు వచ్చేలా పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో కోఆప్షన్ పదవులు ఎవరిని వరిస్తాయో ననే అంశం చర్చనీయాం శంగా మారింది. ఒక మున్సిపాలిటీలో నలుగురు కో ఆప్షన్ సభ్యుల్లో ఇద్దరు పురపాలనపై అవగాహన కలిగిన వారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఒక మహిళ, ఒక పురుషుడు ఉంటారు. మాజీ కౌన్సిలర్లు, మాజీ పురపాలక ఉద్యోగులు, పురపాలనతో అనుబంధంగా ఉండే వాటిలో పనిచేసిన వారిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలో ఓటర్లై ఉన్నవారిని, 21 ఏళ్లు దాటిన వారిని అర్హులుగా భావిస్తారు. మరో రెండు మైనార్టీల నుంచి ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇందులో కూడా ఒక మహిళ, ఒక పురుషునికి అవకాశం ఉంది. వీరికి ఇతర అర్హతలు అవసరం లేదు. కేవలం మున్సిపల్ పరిధిలో 21 ఏళ్లు దాటి ఓటర్లై ఉంటే సరిపో తుంది. మైనార్టీల నుంచి కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోవడం అధికార పార్టీకి ఇబ్బంది లేకపోయినా జనరల్ కో-ఆప్షన్ సభ్యులను ఎంపికచేయడం ఇబ్బందికరంగా మారింది.

## భార్యా భర్తల గొడవలో మామపై అల్లుడి కాల్పులు

జగిత్యాల,ఫిబ్రవరి4(ఆర్ఎన్ఎ): గొల్లపెల్లి మండలం ఎస్రాజ్ పల్లిలో కాల్పుల కలకలం రేగింది. బైరవేణి రాజిరెడ్డిపై ఆయన అల్లుడు ఫ్యాట శ్రీనివాస్ కాల్పులకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ తన భార్యతో గొడవ పడుతుంటే ఆయన మామ రాజిరెడ్డి సర్ది చెప్పేందుకు ప్రయత్నించాడు. దీంతో శ్రీనివాస్ రివాల్వర్‌తో అతనిపై కాల్పులు జరిపా డు. 5 రౌండ్లు ఫైరిరగ్ చేయడంతో రాజిరెడ్డి శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకెళ్లాయి. ప్రస్తుతం రాజిరెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. అతడిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

**IN THE COURT OF THE M.A.C.T-CUM-XXVII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD**
**M.V.O.P. NO.345 OF 2018**

Between:
**Mr. M. Manjula** .....Petitioner
**And**
**Mr. Khaja Mohd and others** ..... Respondents

To
Mr. Khaja Mohd,
S/o. Abdul Gani, Age: Major,
Occ: Owner of Lorry bearing No.KA 32C 5997, H.No.93,
Iqbal Colony,MSK Mill,
near Ring Road,
Kalaburagi, Gulbarga,
Karnataka.
Respondent No.1

Whereas the above named Petitioners filed compensation petition against you and The United India Insurance Company .Ltd for a sum of Rs.15,00,000/- for the accident caused by your vehicle Lorry bearing No.KA 32C 5997 on 16-12-2017 at Mominpet ps Limites. The case is posted to **10-02-2020.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE Honble COURT)
**C. VENU GOPAL REDDY**
**S. VENKAT REDDY**
**A.POORNA CHANDRA RAO**
Advocates.
off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad
Ph: 9440431541

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com